# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం 10 ఫిబ్రవరి 2026 | సంపుటి: 22 | సంచిక: 124 | వెల: రూ.7 | పేజీలు: 12+8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## ముగిసిన పురపోరు

# ప్రచారపర్వం

### 116 మున్సిపాలిటీలు..
### 7 మున్సిపల్ కార్పొరేషన్లలో హోరెత్తిన ప్రచారం

**11న పోలింగ్‌కు ఎన్నికల సంఘం సర్వం ఏర్పాట్లు**



**తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రచార పర్వం ముగిసింది. చివరిరోజు ఉధృతంగా ప్రచారం సాగింది. కాంగ్రెస్ నుంచి మంత్రులు తమ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బిజెపి, బిఆర్‌ఎస్ నేతలు కూడా ప్రచారంలో దూసుకుపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు , 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల ప్రచారానికి తెరపడింది.**

*-హైదరాబాద్, ఫిబ్రవరి9 (నినాదం)*

2

## పట్టణాల అభివృద్ధి

# కాంగ్రెస్‌తోనే సాధ్యం

### రెండేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి

### 12 ఏళ్ల బీజేపీ పాలన, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన చూడండి

**మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు ఓటేయాలని, దీంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలన, 12 ఏళ్ల మోడీ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకుని అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు.**

*- హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నినాదం)*

- **రాష్ట్రంలో అనేక పథకాలతో అభివృద్ధి, సంక్షేమాన్ని చేపట్టాం**
- **మోడీకి మున్సిపల్ ఎన్నికలకు సంబంధం ఏమిటో**
- **తెలంగాణ రూపాయి ఇస్తే.. 42 పైసలే వాపస్ వస్తున్నాయి**
- **ఉత్తరాది బీహార్, యూపిలతో పోలిస్తే దారుణమైన పరిస్థితి**
- **దక్షిణాది రాష్ట్రాలపై కక్షగట్టిన ప్రధాని మోడీ**
- **దక్షిణాది సొమ్ముతో ఉత్తరాది రాష్ట్రాలకు సోకు**
- **ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నట్లు**
- **మీడియా సమావేశంలో గణాంకాలతో వెల్లడించిన సీఎం రేవంత్**



మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన వేళ సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలకు మోడీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మోడీ ముఖం చూసి ఓటేయమని బిజెపి అడగడాన్ని ఎద్దేవా చేశారు. బిజెపి అధ్యక్షుడు ప్రచారంలో పాల్గొన్నా రాష్ట్రానికి ఒక్క పైసా ఉపయోగం లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తూ భారీగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన వాటాలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తూ ఉత్తరాది రాష్ట్రాలకు కేంద్రం పెద్దపీట వేస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా పన్నుల పునఃపంపిణీలో కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన గణాంకాలతో సహా ఎండగట్టారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్తున్న ప్రతి రూపాయికి ప్రతిఫలంగా రాష్ట్రానికి కేవలం 42 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని, ఇది రాష్ట్ర ప్రయోజనాలపై ..మిగతా 2లో

## ఏక్ వికాస్.. సబ్ క..

# సత్తె నాష్!

రాష్ట్ర మున్సిపల్ పోరులో జగిత్యాల నియోజకవర్గం విచిత్రకర సన్నివేశం. ఎవరు ఏ పార్టీ ఓటరుకు తెలియని దుస్థితి. 25 ఏళ్లు కాంగ్రెస్ జెండా మోసి సొంత ఆస్తిగా భావించిన కార్యకర్త పురపోరులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా దర్శనమిస్తున్నారు. 15 సంవత్సరాలు కారు గుర్తుకు ఓటేయమని టిఆర్ఎస్ కండువా వేసుకున్న నాయకులు ఓవర్ నైట్ మూడు రంగుల కండువా వేసుకుని చేతి గుర్తుకు ఓటేయమని ఇంటింటా ప్రచారం చేస్తున్న సన్నివేశం ఓటరును తికమక పెడుతుంది. కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన వెంట ఉన్న టిఆర్ఎస్ క్యాడర్ కు కాంగ్రెస్ బీ ఫామ్ లు ఇప్పిచ్చుకోవడంలో సక్సెస్ అయ్యారు.

9

**- జగిత్యాల ప్రతినిధి ఫిబ్రవరి 9 (నినాదం)**



## 'సర్' ప్రక్రియ కొనసాగాల్సిందే..

### అడ్డంకులు కల్పించవద్దు: సుప్రీంకోర్టు

2

# 11వ తేదీ తర్వాత మీ సంగతి తేలుస్తా!

రాజకీయాల ముసుగులో అరాచకాలు చేస్తామన్నా... ఫోన్లలో బెదిరింపులకు దిగినా సహించేది లేదు. 11వ తేదీ ఎన్నికలు ముగియనివ్వండి.. హద్దులు దాటిన ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తా. చందాలు, దందాలు చేస్తే కింద పడుద్ది జాగ్రత్త! తింగరి వేషాలు వేస్తే ఊరుకోం.. చట్టప్రకారం మీ అందరినీ బొక్కలో వేయించడం ఖాయం అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యర్థులను హెచ్చరించారు.

**- ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 9 (నినాదం)**



- చందాలు.. దందాలు చేస్తే చూస్తూ ఊరుకోం...
- కారుకూతలు కూస్తే బొక్కలోకి పంపడం ఖాయం
- ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచార ముగింపు సభలో మంత్రి పొంగులేటి 'స్ట్రాంగ్ వార్నింగ్'

2

# ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగాలి

### ప్రతి ఒక్కరూ ఓటేసేలా చూసుకోవాలి.. పార్టీ నేతలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

**హైదరాబాద్,ఫిబ్రవరి9(నినాదం):** మున్సిపల్ ఎన్నికల్లో నేతలు సమన్వయంతో ముందుకెళ్లాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలపై కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులపై సీఎం రేవంత్ ఆరా తీశారు. బలహీనంగా ఉన్న మున్సిపాలిటీల్లో పోలింగ్ వ్యూహంపై చర్చించారు. స్థానిక నేతల నేతృత్వంలో పోల్ మేనేజ్‌మెంట్ జరిగేలా చూడాలని మంత్రులకు సూచించారు. ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. ఇవాళ, రేపు ఓటర్లకు నేతలు అందుబాటులో ఉండాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు. ప్రతి ఓటరు బూత్ దగ్గరకు చేరుకునేలా చూడాలన్నారు. ఏమరుపాటు పనికిరాదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటేసేల చూడాలన్నారు.

## పదేండ్లలో బీఆర్ఎస్

# రాచరికపు పాలన

### మేనిఫెస్టోలో హామీలు పూర్తిచేసి అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తాం

- ఎమ్మెల్యే బెదిరింపులకు చెక్ పెడతాం
- వ్యాపారులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- కార్నర్ మీటింగ్‌లో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

2



పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వ రాచరికపు పాలనలో ప్రజలు మోసపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన హామీలను ఒకదాని తర్వాత ఒకటి అమలు చేసుకుంటూ పోతున్నామని ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు.

**- జమ్మికుంట, ఫిబ్రవరి 9 (నినాదం)**

## స్వర్ణాంధ్ర 2047

# విజన్ లక్ష్యాలు సాధించాలి

**అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ పథకాలు**

- క్వాంటమ్ కంప్యూటర్లు ఎగుమతి చేసే స్థాయికి ఏపీ
- జిల్లాస్థాయిలో కలెక్టర్లు, మంత్రులు సమన్వయంతో సాగాలి
- అధికారులు, కార్యదర్శులు, మంత్రులతో సీఎం చంద్రబాబు



2

## రేవంత్‌కు పాలన చేతకాకనే

# కేసీఆర్‌ను తిడుతుండు

### రెండేళ్ల తర్వాత గులాబీ జెండా ఎగరడం ఖాయం



- ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు వెంటాడుతాం
- భూపాలపల్లి జిల్లా తెచ్చి అభివృద్ధి చేసింది కేసీఆర్
- ఓటుకు నోటు కేసులో ఆధారాల్లేకుండా అగ్ని ప్రమాదం కుట్ర
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డికి పాలన చేతకాకనే మాజీ సీఎం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తిడుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సోమవారం భూపాలపల్లిలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలోబాగంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల్లో గెలిస్తే కల్యాణలక్ష్మి డబ్బులతో పాటు తులం బంగారం ఇస్తానని అబద్ధాలు చెప్పిందని అన్నారు.

**- జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం)**

# స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం?

### తమను మాట్లాడనివ్వడం లేదని ప్రతిపక్షాల ఆరోపణ

పార్లమెంట్ సభా కార్యకలాపాలకు ఆటంకం

విపక్షాల నిరసనలతో లోక్‌సభ పలుమార్లు వాయిదా



2

## తిరుమల లడ్డూ కౌంటర్లలో

# ఆన్‌లైన్ పేమెంట్

**క్యూఆర్ కోడ్‌తో విక్రయానికి యోచన**

2

# మైనర్‌పై అఘాయిత్యం

నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష,
20 వేల రూపాయల జరిమానా
ఎస్పీ స్నేహ మెహ్రా

5

# కాంగ్రెస్ అభ్యర్థికే ప్రజల మద్దతు

### ప్రజాపాలన అజెండాతో ప్రచారం

### ఇస్లావత్ రాజు నాయక్‌కు ఓటర్ల బ్రహ్మరథం

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** మున్సిపల్ ఎన్నికల వేడి రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇస్లావత్ రాజు నాయక్ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతోంది. ప్రజల సమస్యలే తన ప్రచార అజెండాగా, ప్రజాపాలనే తన లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆయనకు అన్ని వర్గాల నుంచి విశేష మద్దతు లభిస్తోంది.







వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ స్థానికుల సమస్యలను నేరుగా తెలుసుకుంటున్న రాజు నాయక్, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై స్పష్టమైన హామీలు ఇస్తున్నారు. ముఖ్యంగా గతంలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను గుర్తించి, అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారం దిశగా కృషి చేస్తానని భరోసా ఇస్తుండటంతో ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది. యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు భద్రత, పేదలకు సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాహిత విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో కౌన్సిలర్‌గా చురుకైన పాత్ర పోషిస్తానని చెబుతున్నారు. ప్రచారంలో భాగంగా వృద్ధులు, మహిళలు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొంటూ తమ మద్దతు ప్రకటించడం విశేషంగా మారింది. "మా వార్డుకు అందుబాటులో ఉండే నాయకుడు కావాలి... సమస్య చెప్పగానే స్పందించే వ్యక్తి కావాలి" అనే అభిప్రాయంతో ప్రజలు రాజు నాయక్ వైపు మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. ప్రజలతో నిత్యం మమేకమై, వార్డు అభివృద్ధినే ధ్యేయంగా పనిచేస్తానని చెబుతున్న ఇస్లావత్ రాజు నాయక్‌కు ఈ ఎన్నికల్లో ప్రజల మద్దతు మరింత బలపడుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## పొలం బాట పట్టిన స్వతంత్ర అభ్యర్థి

### గెలిపించండి రుణపడి ఉంటాను

### స్వతంత్ర అభ్యర్థి అజ్మీర సౌందర్య వీరన్న నాయక్





**డోర్నకల్/మరిపెడ, ఫిబ్రవరి 09(నినాదం):** నిరుపేద రైతు కుటుంబం నుంచి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా వార్డ్ అభివృద్ధి కోసం బరిలో నిలిచానని అజ్మీరా వీరన్న అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ లోని రెండో వార్డులో ఎన్నికల చివరి రోజు ప్రచారం కావడంతో విస్తృతంగా పొలం బాట పట్టి కూలీలకు ఓట్లను అభ్యర్థించారు.నిరుపేద రైతు కుటుంబంలో పుట్టి కేవలం రెండవ వార్డ్ అభివృద్ధి కోసం మాత్రమే బరిలో నిలిచానని, అందరూ ఏకమై ఉంగరం గుర్తుకు ఓటు గెలిపించాలని కోరారు. పార్టీలు చేయలేని అభివృద్ధిని స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన తర్వాత వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు.రెండో వార్డ్ లోని యువత,ప్రజల సపోర్టుతో మీ ముందుకు వచ్చానని,మాయ మాటలు చెప్పే వారికి ఓటు వేయకుండా మీ కోసం పని చేసే వారికి ఓటు వేయండి అని కోరారు.మిర్చి ఏరుతున్న కూలీలు సైతం హామీ ఇచ్చి ఏమి బాధపడవద్దని ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

## మా ఓటు బూర రమాదేవికే..

### తెగేసి చెబుతున్న వార్డు ప్రజలు

### బ్రహ్మరథం పడుతున్న మహిళలు

### 44వ వార్డులో విస్తృత ప్రచారం



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 9 (నినాదం):** పలుమార్లు మా ఓటును వివిధ పార్టీలకు వేసి ఉపయోగం లేకుండా పోయిందని ఈసారి మా ఓటు భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బూర (పెద్ది) రమాదేవి లక్ష్మణ్ కు వేస్తామని 44 వ వార్డు ప్రజలు తెగేసి చెబుతున్నారు. ఆమె వార్డులో చేస్తున్న ప్రచారం చూస్తుంటే విజయోత్సవ ర్యాలీని తలపిస్తుంది ముఖ్యంగా మహిళలు ఆమెకు బ్రహ్మరథం పడుతున్నారు. సోమవారం వార్డులో గడపగడపకు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను రాజకీయాలలోకి సంపాదన కోసం రాలేదని వార్డు ప్రజలకు సేవ చేసే లక్ష్యంతోనే నామినేషన్ వేశానని తెలిపారు .వార్డులో కాలువల పరిస్థితి అధ్వానంగా ఉందని తాను గెలిచాక వాటిని మరమ్మత్తు చేయిస్తానని అదేవిధంగా నల్ల నీటి సమస్య అధికంగా ఉండటంతో ఆ సమస్యను సైతం పరిష్కరిస్తానని అంటున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పలు అభివృద్ధి పథకాలను గడపగడపకు వివరిస్తున్నామని ప్రజల నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే తప్పక విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**అవకాశం ఇవ్వండి అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా..**



కౌన్సిలర్ గా అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని, మాజీ శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు సహకారంతో వార్డుకు అధిక నిధులు తెచ్చి ఆదర్శ వార్డుగా నిలుపుతానని ఏది ఏమైనా 44 వ వార్డులో బిజెపి జెండా ఎగరడం ఖాయమని అన్నారు.

## 19వ వార్డులో బీఆర్ఎస్‌కు ప్రజల బ్రహ్మరథం





### దూసుకుపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాడ హరీష్‌రెడ్డి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాడ హరీష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం ఉత్సాహ భరితంగా కొనసాగుతోంది. ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ స్పందనతో ఆయన ప్రచారం రోజు రోజుకూ మరింత వేగం పుంజుకుంటోంది. ప్రచారానికి వస్తున్న ప్రతి వీధిలోనూ, ప్రతి ఇంటి వద్దనూ ప్రజలు బ్రహ్మరథం పడుతూ తమ సంపూర్ణ మద్దతు ప్రకటించడం విశేషంగా మారింది. వార్డు అభివృద్ధే లక్ష్యంగా గతంలో చేసిన సేవలు, సమస్యల పరిష్కారంలో చూపిన చొరవనే తన ప్రచార ఆయుధంగా హరీష్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారు. తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పిస్తూ, భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తున్నారు. ప్రత్యేకంగా పేదల సంక్షేమం, వృద్ధులు, మహిళలు, యువతకు అవసరమైన సదుపాయాలపై దృష్టి సారిస్తానని ఆయన హామీ ఇస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాలు వార్డు స్థాయిలో మరింత బలోపేతం అయ్యేలా కృషి చేస్తానని చెబుతూ ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతున్నారు. ఇంటింటి ప్రచారంలో ప్రజలతో స్నేహపూర్వకంగా మమేకమవుతూ, వారి సమస్యలను నేరుగా వింటూ తక్షణమే పరిష్కార మార్గాలు సూచించడం హరీష్‌రెడ్డికి ప్రత్యేక గుర్తింపుగా మారింది. "మా సమస్యలపై వెంటనే స్పందించే నాయకుడు మాడ హరీష్‌రెడ్డే" అని స్థానికులు బహిరంగంగా మద్దతు ప్రకటిస్తున్నారు. 19వ వార్డులో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలమైన పట్టును అందిస్తూ, ప్రజల విశ్వాసంతో ముందుకు సాగుతున్న మాడ హరీష్‌రెడ్డి ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తారని కార్యకర్తలు, అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## 25 కోట్ల పార్కు స్థలం స్వాధీనం

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 9 (నినాదం):** జిహెచ్ఎంసి నార్సింగి సర్కిల్ లో కబ్జాకు గురైన 25 కోట్ల పార్కు స్థలాన్ని హైడ్రాధికారులు స్వాధీనం చేసుకున్నారు.నార్సింగి టౌన్ లోని అరుణోదయ హౌసింగ్ సొసైటీకి చెందిన సుమారు 1600 గజాల పార్కు స్థలాన్ని ఓ నాయకుడు కబ్జా చేసేటట్లు ఫిర్యాదు అందడంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగి సోమవారం ఉదయం పార్కు స్థలానికి చేరుకొని పార్కు స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేసి పార్కు స్థలాన్ని తన ఆధీనంలోకి తీసుకొని ఫెన్సింగ్ వేశారు. ప్రభుత్వ స్థలలను ఆక్రమిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ



సహించబోమని చట్టపోయారమైన చర్యలు తప్పవని హైడ్రా అధికారులు హెచ్చరించారు.

## ఇస్లావత్ తిరుపతిని గెలిపించండి

### వార్డ్ అభివృద్ధి కోసమే బరిలో నిలిచాను

### కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఇస్లావత్ తిరుపతి



**డోర్నకల్/మరిపెడ ఫిబ్రవరి 09(నినాదం):** మరిపెడ మున్సిపాలిటీ 1వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఇస్లావత్ తిరుపతి యువత తో కలిసి ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో విస్తృతంగా ప్రతి ఇంటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని కోరారు. వార్డ్ అభివృద్ధి కోసం కట్టుబడి పని చేస్తానని, యువతకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు,200 వందల యూనిట్ల ఉచిత కరెంటు,అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు. గెలుపు కోసం ఒక అవకాశం ఇవ్వాలని కోరారు..వారి వెంట యువకులు ప్రచారంలో పాల్గొన్నారు.

## మైనర్‌పై అఘాయిత్యం

### నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, 20 వేల రూపాయల జరిమానా

### ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, ఫిబ్రవరి 9(నినాదం):** వికారాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించిన మైనర్ బాలిక లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష మరియు 20 వేల రూపాయల జరిమానా విధిస్తూ వికారాబాద్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ సోమవారం వెల్లడించారు. 2023లో వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెం: 150/2023 ప్రకారం వికారాబాద్ మండలానికి చెందిన అత్వెల్లి నరేందర్, అలియాస్ నరేష్ అనే వ్యక్తి ఒక మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు పోక్సో చట్టం, ఇతర ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు విచారణ వికారాబాద్‌లోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సి.హెచ్. చంద్ర కిషోర్ సమక్షంలో జరిగింది. పోలీస్ అధికారులు సమర్పించిన శాస్త్రీయ సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతనికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు 20 వేల రూపాయల జరిమానా విధించారు. అంతేకాకుండా, బాధితురాలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పరంగా రూ. 5 లక్షల నష్టపరిహారాన్ని అందజేయాలని కోర్టు ఆదేశించింది. నిందితుడికి కఠిన శిక్ష పడేలా పకడ్బందీగా వ్యవహరించిన అధికారులను మరియు సిబ్బందిని ఎస్పీ స్నేహ మెహ్రా ప్రత్యేకంగా అభినందించారు. నాటి దర్యాప్తు అధికారులు టి. శ్రీను అప్పటి వికారాబాద్ సి.ఐ బి.వి. సత్యనారాయణ అప్పటి వికారాబాద్ ఎస్‌డిపిఓ, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెరాజ్ ఫిర్దోస్, ప్రస్తుత సీఐ కె. రఘు కుమార్, కోర్టు లైజనింగ్ ఎస్. నిరంజన్ గౌడ్, భరోసా సెంటర్ ప్రతినిధులు శ్వేత,ఎస్ఐ కీర్తి ఆకుల, కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ ఎల్. నరేందర్ ఏ.ఎస్.ఐ, జి. మణిక్ ప్రభు,పీసీలను ఎస్పీ ప్రశంసించారు. మహిళలు చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా లేదా నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ గారు ఈ సందర్భంగా హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని ఆమె స్పష్టం చేశారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 9 (నినాదం):** రాజేంద్రనగర్ నియోజకవర్గం, శంషాబాద్ మండలం పాల్మకూల్ గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని మహిళా సంఘాలు స్థానిక అవసరాల కోసం కేటాయించిన నిధులతో నిర్మించనున్న భవనాలకు ఆయన భూమి పూజ నిర్వహించారు.ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ఈజీఎస్ 10 లక్షల రూపాయల నిధులతో గ్రామ సమాఖ్య భవనం, 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి కేటాయించిన 15 లక్షల రూపాయలతో నిర్మించనున్న పల్లె దావకాన భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా సంఘాల బలోపేతానికి ఈ వీూ భవనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. నిర్ణీత కాలపరిమితిలోగా నాణ్యతతో భవన నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను



ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్, ఎంపీడీఓ, మున్ని, వార్డ్ సభ్యులు, మహిళా సంఘాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నన్ను గెలిపిస్తే ప్రభుత్వ పాఠశాల తెస్తా..

### 44 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మలగం రమేష్



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 9 (నినాదం):** తనను గెలిపిస్తే వార్డు కు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ను మంజూరు చేయిస్తానని 44 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మలగం రమేష్ హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార ఘట్టం చివరి రోజు వార్డు ప్రజలతో మాట్లాడుతూ తాను ఇప్పటికి రెండు పర్యాయాలు కౌన్సిలర్ గా గెలిచానని తన హయాంలో వార్డులో త్రాగునీరు, మురికి కాల్వల నిర్వహణ, అంతర్గత రోడ్లు నిర్మాణం చేయించానని, తరచూ ముంపుకు గురవుతున్న నల్గొండ రోడ్ లోని పెద్దమోరి అభివృద్ధి తనవల్లనే జరిగిందని... మరల తనను గెలిపిస్తే ప్రాథమిక పాఠశాల తోబాటు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని రమేష్ హామీ ఇచ్చారు.

## ఉపాధిహామీ పనుల సమీక్ష



**కోదాడ, ఫిబ్రవరి 9 (నినాదం):** పాలవరం గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో హరి సింగ్ నాయక్ పరిశీలించారు.ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పనులలో ప్రామాణికత, సమయపాలన పాటిస్తూ గ్రామస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించమని సూచించారు. అలాగే, పనుల ప్రగతి, ఉద్యోగ లభ్యత, నీటి నిల్వల అభివృద్ధి పైన కూడా ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్టపల్లి నరేష్ గౌడ్, కార్యదర్శి శ్రీకాంత్ ఉన్నారు.

## ఎన్నికల సామాగ్రి పంపిణీ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 9 (నినాదం):** మునిసిపల్ సాధారణ ఎన్నికలు–2026లో భాగంగా మిర్యాలగూడ మునిసిపల్ 48 వార్డులకు ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణి, స్వీకరణ కేంద్రాన్ని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ సోమవారం పరిశీలించారు. 48 వార్డులకు 244 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు ప్రెసైడింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కు ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లేందుకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్స్, ఇతర సామాగ్రిని మంగళవారం తీసుకు వెళ్లనున్నారు. వారి కోసం భారీగా షామియానాలను ఏర్పాటు చేశారు. వాటిని సబ్ కలెక్టర్ అమిత్ పరిశీలించి లోటు పాట్లు ఉంటే సలహాలు, సూచనలిచ్చారు. ఆయన వెంట మునిసిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్, డిఇఇ వెంకన్న, మేనేజర్ జి.జ్ఞానేశ్వరి, టిపిఎస్ కె.అంజయ్య, రెవిన్యూ శాఖ ఆర్ఐలు టి.రామకృష్ణ, బి.సత్యనారాయణ, కృష్ణయ్య ఉన్నారు.

## పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి





### జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె.హరిత

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9 (నినాదం):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం కాగజ్ నగర్ పట్టణంలోని డి.ఎ.వి. పాఠశాలలో ఏర్పాటుచేసిన మున్సిపల్ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికలలో భాగంగా కాగజ్ నగర్ మున్సిపాలిటీలోని 30 వార్డులకు గాను 85 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలలో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి, సామాగ్రి పంపిణీ సిబ్బందికి భోజన వసతులు, ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ లో సి సి కెమెరాలు, బందోబస్తు కల్పించాలని, ఈ నెల 13వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఎన్నికల ప్రశాంతంగా జరిగే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో సిసి కెమెరాలు, వీడియోగ్రఫీ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసిల్దార్ మధుకర్, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర

### మూగబోయిన మైకులు

**నల్లగొండ ప్రతినిధి ప్రతినిధి, ఫిబ్రవరి 9 (నినాదం) :** మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రం ఐదు గంటలకు తెర పడింది. మైకులుమూగపోయాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 17 మున్సిపాలిటీలు నల్లగొండ కార్పొరేషన్ కు పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో గల వార్డులలో హోరా హోరీగా జరిగిన ప్రచారం సోమవారం సాయంత్రం తో ముగిసింది. ప్రతి వార్డులో ప్రధాన పార్టీల తో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు సైతం ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఆయా ఆటోలు ప్రచారం ముగియడంతో విశ్రాంతి తీసుకోనున్నాయి. ఆరు రోజుల నుంచి ప్రధాన పార్టీలతోపాటు కొన్ని వార్డులలో రెబల్స్ సైతం ఇండిపెండెంట్ లుగా పోటీలో ఉండి విస్తృతంగా ప్రచార హోరు కొనసాగించారు. కాంగ్రెస్ బిఆర్ఎస్, సిపిఎం, బిజెపి, ఎంఐఎం, బీఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్, పార్టీలతో పోటీగా ఇండిపెండెంట్ అభ్యర్థులు మేము సైతం అంటూ నిర్వహించిన ప్రచారం కొన్ని వార్డు వాసులకు ఆశ్చర్యాన్ని గురిచేసింది. అని పలువురు పేర్కొంటున్నారు. ఈ నెల 11న ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ ను సజావుగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు.

## డిస్ట్రిబ్యూషన్ కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**కోదాడ, ఫిబ్రవరి 9 (నినాదం):** కోదాడ మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా స్థానిక సీసీ రెడ్డి కాన్వెంట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సోమవారం సందర్శించారు. సిబ్బందికి తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని, లైటింగ్, త్రాగునీరు, టాయిలెట్స్, భోజన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లను సరిచూసుకొని ఎస్కార్ట్ వాహనంతో పోలింగ్ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అనంతరం తమరబండ పాలెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు కష్టపడి చదవాలని, ముఖ్యంగా సైన్స్, మాథ్స్, ఇంగ్లీషులో అధిక మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తహసిల్దార్ వజిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.





# తిరుమలలో సొంత డెయిరీపై ఆలోచించాలి!

**తిరుమల పవిత్రతను కాపాడేందుకు తీసుకునే చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడితే బాగుంటుంది. ఎందుకంటే దాదాపు ఏడాది న్నరగా తిరుమల లడ్డూ కల్తీ చుట్టూనే రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ విషయంలో సిట్ దర్యాప్తు సాగుతోంది. ప్రత్యేక విచారణలు చేపట్టారు. మరో ఏకసభ్య కమిటీ వేస్తున్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇక తిరుమల పవిత్రత దెబ్బతినకుండా, రాజకీయాలకు తావు లేకుండా కఠిన చర్యలకు అసవరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దృష్టి పెడితే మంచిది.**

ఎడిటోరియల్

తిరుమలలో తీసుకునే నిర్ణయాలను ఇపరేడు ఎవ్వరూ ప్రశ్నించరు. భక్తులకు వసతి పెంచడం, సౌకర్యాలు పెంచడం, శీఘ్రగతిన దర్శనాలు కల్పించడంలో ప్రధాన నిర్ణయాలు జరగాలి. తిరుమలలో సామాన్యులకు సత్వర దర్శనం అన్నది కలగా మారింది. విఐపిల తాకిడి పెరుగుతోంది. స్వామిని దర్శించుకున్న వారే ఇంకా దర్శించుకుంటున్నారు. అలాగే తిరుమలలో ప్లాస్టిక నిషేధం జరగాల్సి ఉంది. లడ్డూలను తాటాకు బుట్టల్లో సరఫరా చేస్తామని గతంలో ప్రకటించినా అమల్లోకి రాలేదు. మంచినీటి సమస్యలు రాకుండా చూడాలి. తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటుపై ఆలోచన చేయడం లేదు. ఇకపోతే తెలంగాణ నేతల సిఫార్సులపై విక్ష ఇంకా కొనసాగుతోంది. ఈ విక్ష తొలగిపోవాలి. తెలంగాణ నేతలను చిన్నచూపు చూడడం ద్వారా ప్రభుత్వం ఈ ప్రాంతా ప్రజలను అవమానపరుస్తోంది. తిరుమల కొండల్లో పచ్చదనం పెంచాల్సి ఉంది. అడువుల్లో సామాజిక వనాలు పెరగాలి. ఇవన్నీ వదిలేసి ఇంకా కల్తీ నెయ్యి వ్యవహారంతో టిడిపి కూటమి ఒకవైపు, వైకాపా నేతలు మరో వైపు అన్నట్లుగా విమర్శలు, ప్రతివిమర్శలు చేయడం సరికాదు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో సాగుతున్న రాజకీయ ఘటనలు దిగజారుతున్న రాజకీయ విలువలకు పరాకాష్టగా మారాయి. తిరుపతి లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు జోక్యంతో సిబిఐ ఏర్పాటు చేసిన సిట్ నివేదిక బహిరంగ పరచకుండానే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ స్వంత వ్యాఖ్యానాలతో రాజకీయంగా లబ్ధి పొందే చర్యలకు దిగారు. లడ్డూ ప్రసాదంలో కొవ్వు అంటూ అధికార కూటమి చేసిన ప్రచారానికి ప్రాయశ్చితంగా యజ్ఞాలు, యాగాలు, పూజలకు వైసిపి నాయకులు తెరతీసారు. దీనికి పోటీగా లడ్డు కల్తీ చేసిన వైసిపి నేతలంటూ అనేక జిల్లాల్లో పేరు, ఊరు లేని బ్యానర్లు వెలిశాయి. పరస్పర విమర్శలతో మొదలై, హద్దులు దాటిన వ్యక్తిగత విమర్శలకు చేరి, దాడులకు, గృహ దహనాల వరకు ఆ వివాదం విస్తరించింది. తిరుపతి లడ్డు కోట్ల మంది ప్రజల విశ్వాసంతో ముడిపడిన సున్నితమైన అంశం. తమ విశ్వాసానికి తగ్గట్టుగా ప్రసాదం పవిత్రంగా వుండాలని కోరుకుంటారు. అలాంటి లడ్డూలో ఆవు కొవ్వు, ఇతర జంతువుల కొవ్వుల లాంటివి కలిశాయని ముఖ్యమంత్రి చెప్పడంతో తక్షణం నిజానిజాలు తేల్చి దోషులకు శిక్ష వేసివుంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందూ మతానికి అపచారం జరిగిందంటూ కనకదుర్గమ్మ గుడి మెట్లు కడిగారు. ఇలా కాకుండా నిజాలు నిగ్గుతేల్చి దోషులను కోర్టు ముందు నిలబెట్టి ఉంటే బాగుండేది. అన్నింటికి మించి తిరుమల శ్రీవారు కోట్లకు పడగలెత్తారు. ఆయనకు వందలాది గోవులు కూడా ఉన్నాయి. నిజానికి చిత్తశుద్ధి ఉంటే గోశాలలను విస్తరించి, సొంత డెయిరీ ఏర్పాటు చేసివుంటే పేచీ వచ్చేది కాదు. గోశాలలను పెంచి, డెయిరీ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్యా కొంత తీరుతుంది. నెయ్యి కల్తీ సమస్య ఉత్పన్నం కాదు. కల్తీ తీవ్రమైన ఆరోపణ కాబట్టి సంబంధిత అధికార సంస్థల ద్వారా నేరాన్ని నిరూపించి నిందితులకు శిక్షపడేలా చేయడం ప్రభుత్వ బాధ్యత. అందుకోసం నియమించిన సిట్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలి. నివేదికలో ఏముందో ప్రకటించకుండానే మరో కమిటీ వేయడంలో అర్థం లేదు. నిజానికి కల్తీ నెయ్యి వ్యవహారం తిరుమల ప్రతిష్టను దెబ్బ తీసేందుకు జరిగిన కుట్ర అనడంలో సందేహం లేదు. హిందూ మతంపై దాడి అని అనడంలోనూ సందేహం లేదు. గతంలో జరిగిన రామతీర్థం, అంతర్వేది, దుర్గ గుడి విగ్రహాల విధ్వంసం, రథాలు కాలిపోవడం లాంటి విషయాలను ప్రస్తావించి ఇదంతా హిందూ మతాన్ని దెబ్బతీసి నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్ర అని పవన్ కళ్యాణ్ ఇప్పటికే ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల చర్యలు అంతిమంగా తమ రాజకీయ పబ్బం గడుపుకునేలా తయారయ్యాయి. ఈ సమస్యలనే ఇక ఇంతటితో ముగించాలి. తిరుమల శ్రీవారికి అవసరమైన ఆవునెయ్యిని పొందేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. తిరుమలలో డెయిరీ ఏర్పాటు చేస్తే మరీమంచిది. శాశ్వతంగా సమస్యకు పరిష్కారం దక్కగలదు. వేలకోట్లు వృధా చేసే బదులు శ్రీవారికి అవసరమైన నెయ్యి, పాలు, వెన్న, మీగడలను పొందేందుకు ఇదే సరైన సమయం. డబ్బులకు కొదవ లేదు. గోవులకు కొదవ లేదు. చంద్రబాబు హెరిటేజ్ నడిపిన అనుభవంతో తిరులమ శ్రీవారి కోసం ఓ మంచి డెయినీ ఏర్పాటు చేస్తే మంచిది. సుగంధ ద్రవ్యాలను కూడా కొండపై పండించే అవకాశలను పరిశీలించాలి. పూదోటలను విస్తరించాలి. ఆ దిశగా కూటమి నేతలు ఆలోచనలు చేయాలి. సమర్థులైన అధికారులు, బోర్డు ఛైర్మన్, సభ్యులు, ఉన్నపరేడే ఇది సాధ్యం అవుతుంది. రాజకీయ తాబేదార్లకు బోర్డును అప్పగించినంతకాలం ఇది ఇది సాధ్యం కాదు. ఇకపోతే తిరుమల కల్తీ వ్యవహారాన్ని కోర్టుల తుది తీర్పుకు వదిలేయాలి. అప్పటి వరకు రాజకీయ విమర్శలకు దిగకపోవడం మంచిది.

# లేబర్ కార్డుతో లేబర్‌కు భద్రతా భరోసా

దినసరి కూలీగా పనిచేస్తున్న వారి జీవితం ప్రతిరోజూ యుద్ధమే, కుటుంబ పోసిన కోసం అనుక్షణం పోరాడుతుంటారు, ప్రతి రోజు పని దొరికితేనే ఇంట్లో పొయ్యి వెలుగుతుంది, పనిలేక పోతే ఆలోచనలతోనే అర్ధాకలితోనే రోజును సాగదీయాలి. ఇంకా పని చేసే చోట అనుకోని ప్రమాదాలు జరిగితే బ్రతుకు సాగడానికి గగనం అవుతుంది, ఇంట్లో ఏదైనా శుభకార్యం చేయాలి అనుకున్నా, కష్టంలో సహాయం చేయడానికి మార్గాలను అన్వేషిస్తూ ఉండాలి. అలాంటి కూలీలకు భరోసానే లేబర్ కార్డు. లేబర్ కార్డ్ (కార్మిక కార్డు) అనేది నిర్మాణ మరియు అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రభుత్వం జారీ చేసే గుర్తింపు కార్డు. లేబర్ కార్డు ఎన్నో ప్రయోజనాలు ఇది బీమా, ఆరోగ్య సంరక్షణ, పిల్లల విద్య, వివాహం మరియు ప్రసూతి ప్రయోజనాల వంటి సంక్షేమ పథకాలను పొందడానికి,, భవన నిర్మాణ కార్మికులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ కార్డు కోసం ఆన్‌లైన్‌లో (TBOCWWB పోర్టల్) లేదా సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రమాద బీమా



ద్వారా పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే మరణానికి రూ. లక్షల్లో నష్టపరిహారం లేదా గాయాలైతే వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం లభిస్తుంది. కార్మికుల పిల్లల చదువుకు స్కూల్ స్థాయి నుంచి ఉన్నత విద్య స్థాయి వరకు వార్షిక స్కాలర్‌షిప్‌లు అందుతాయి. కార్మికుల కుమార్తెల వివాహం కోసం ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందుతుంది. మహిళా కార్మికులకు లేదా కార్మికుల భార్యలకు ప్రసూతి సమయంలో ఆర్థిక సాయం లభిస్తుంది. కార్మికులకు మరియు వారి కుటుంబ సభ్యులకు అనారోగ్యం, ఆసుపత్రి ఖర్చుల కోసం సాయం అందుతుంది. స్వంత ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం నుండి ప్రత్యేక సాయం పొందవచ్చు. లేబర్ కార్డు పొందాలనుకుంటే గత ఒక సంవత్సరంలో కనీసం 90 రోజులు నిర్మాణ కార్మికునిగా పనిచేసి ఉండాలి. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, వయస్సు ధృవీకరణ పత్రం, ఫోటోలు. లేబర్ కార్డు పొందినవారు ప్రతిసంవత్సరం లేబర్ కార్డును రెన్యూవల్ చేసుకుంటేనే ప్రయోజనాలు నిరంతరంగా అందుతాయి. కార్మికులందరూ లేబర్ కార్డు తీసుకొని తమ కుటుంబ భవిష్యత్తుకు భద్రత కల్పించుకోవాలి. ఇది హక్కు మాత్రమే కాదు.. రేపటి జీవితానికి భరోసా.

డాక్టర్. వై. సంజీవ కుమార్
ఫౌండర్ & ప్రెసిడెంట్
స్కై ఫౌండేషన్
9393613555



# ఆస్ట్రేలియా చూపిన ధైర్యం మనకెప్పుడు?

## భారత్ ఇకనైనా మేల్కొనాలి!

### బాల్యంపై సోషల్ మీడియా సర్జికల్ స్ట్రైక్! మేల్కోలేకపోతే రేపటి తరం మానసిక వికలాంగులే!

**నేటి ఆధునిక యుగంలో సాంకేతికత మానవ జీవన గమనాన్ని మార్చేసింది. కానీ, అదే సాంకేతికత నేడు మన భావి భారత పౌరులైన పిల్లల పాలిట యమపాశంగా మారుతోంది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జరిగిన గుండెలను పిండేసే సంఘటనే దీనికి నిదర్శనం. ఆన్‌లైన్ గేమ్‌లు, సోషల్ మీడియా సీరియల్స్‌కు బానిసలైన ముగ్గురు మైనర్ సోదరీమణులు, తల్లిదండ్రులతో ఏర్పడిన చిన్నపాటి ఘర్షణకే తమ నివాస భవనం తొమ్మిదో అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకోవడం సభ్య సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఇది కేవలం ఒక విషాద వార్త మాత్రమే కాదు; సోషల్ మీడియా కంపెనీలు తమ బ్యాంక్ బ్యాలెన్స్‌లను పెంచుకోవడానికి అమాయక పిల్లల ప్రాణాలను ఏ విధంగా బలిపీఠం ఎక్కిస్తున్నాయో చెప్పడానికి ఒక భయానక హెచ్చరిక.**



> పిల్లలకు ఆన్‌లైన్ లోకం కంటే నిజ జీవితంలోని మానవీయ సంబంధాలే ముఖ్యమని, వారితో సమయం గడపడం ద్వారా తెలియ జెప్పాలి. ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి ఈ డిజిటల్ విష వలయం నుండి బాల్యాన్ని రక్షించ కపోతే, రేపటి తరం మానసిక సమస్యల సుడిగుండంలో చిక్కుకోవడం ఖాయం.

**అల్గారిథమ్స్ కుట్ర.. వ్యసనంలో చిక్కుకున్న మెదడు**

సోషల్ మీడియా దిగ్గజాలు పిల్లల భద్రత కంటే వారిని నిరంతరం తమ ప్లాట్‌ఫారమ్‌లకు అతుక్కుపోయేలా చేసే 'అడిక్టివ్ అల్గారిథమ్స్' (Addictive Algorithms)కే ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ అల్గారిథమ్స్ పిల్లల్లో విపరీతమైన ఆందోళన (Anxiety), తమ శరీరాకృతిపై అసంతృప్తి, సామాజిక జీవితం పట్ల అసహ్యం మరియు ఆత్మహత్య ఆలోచనలను పెంపొందిస్తున్నాయి. కౌమారదశలో మెదడు నిర్మాణం మరియు విధుల్లో వేగంగా మార్పులు వచ్చే క్రమంలో, ఈ డిజిటల్ వ్యసనం మద్యం మరియు పొగాకు కంటే ప్రమాదకరమైన రీతిలో వారిని బానిసలుగా మార్చుకుంటోంది. పిల్లల ఆట, చదువు, నిద్ర వంటి కనీస అవసరాలను కూడా ఈ డిజిటల్ మహమ్మారి ఆక్రమిస్తోంది. దీనివల్ల పిల్లలు వాస్తవిక ప్రపంచానికి దూరమై, డిజిటల్ మాయాజాలంలో చిక్కుకుపోతున్నారు. మెదడులోని 'రివార్డ్ పాత్‌వేలను' ప్రేరేపించే ఈ అల్గారిథమ్స్ పిల్లలను మానసిక రోగులుగా మారుస్తున్నాయని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

**టెక్ కంపెనీల కపట బుద్ధి**

గతంలో పొగాకు కంపెనీలు తమ ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలను దాచిపెట్టి ఎలాగైతే కబడ్డు ఆడాయో, నేటి టెక్ కంపెనీలు కూడా అదే దారిలో నడుస్తున్నాయి. పిల్లలకు సోషల్ మీడియాను నిరాకరించడం వారి సమాచార హక్కును కాలరాయడమేనని, హానిపై ఆధారాలు బలహీనంగా ఉన్నాయని వాదించడం ఈ కంపెనీల కపటత్వానికి నిదర్శనం. బాధ్యతను పూర్తిగా తల్లిదండ్రులపైకి నెట్టేస్తూ లాభాల వేటలో పడ్డాయి.

అమెరికా కోర్టుల్లో బయటపడిన ఆధారాల ప్రకారం, తమ ప్లాట్‌ఫరమ్‌ల వల్ల బాలికలు లైంగిక హింసకు, మానవ అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిసి కూడా 'మెటా' వంటి సంస్థలు మౌనంగా ఉన్నాయి. వయస్సు నిర్ధారణ (Age Verification) విషయంలో ఈ సంస్థల నిర్లక్ష్యం ఎంతలా ఉందంటే, అమెరికాలో 8-12 ఏళ్ల వయస్సున్న పిల్లల్లో 40 శాతం మంది నిబంధనలకు విరుద్ధంగా ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వాడుతున్నారు. అంటే 13 ఏళ్ల వయోపరిమితి అనేది కేవలం కాగితాలకే పరిమితమైందని స్పష్టమవుతోంది.

**ప్రపంచ దేశాల అడుగులు - భారత్ మేల్కొనాలి**

ఈ ముప్పును గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం, 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. వయస్సు నిర్ధారణ బాధ్యతను పూర్తిగా కంపెనీలపైనే ఉంచింది. అమెరికా, యూకే, జపాన్ మరియు దక్షిణ కొరియా వంటి దేశాలు కూడా కఠిన చట్టాల దిశగా అడుగులు వేస్తున్నాయి, ఎందుకంటే గత దశాబ్ద కాలంలో ఈ దేశాల్లో యువత మానసిక ఆరోగ్యం దారుణంగా క్షీణించింది.

భారతదేశంలో పరిస్థితి మరింత విషమంగా ఉంది. స్మార్ట్‌ఫోన్ల వ్యాప్తి వేగంగా పెరుగుతోంది. ASER 2024 నివేదిక ప్రకారం, గ్రామీణ భారతంలో సైతం 16 ఏళ్ల లోపు పిల్లల్లో మూడింట ఒక వంతు మందికి సొంత స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. మన దేశ పాలకులు యువత గురించి, 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' (Youth Dividend) గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. కానీ, ఆ యువ సంపదను టెక్ కంపెనీల లాభాల కోసం బలి ఇవ్వకుండా కాపాడుకోవాల్సిన బాధ్యతను మాత్రం విస్మరిస్తున్నారు.

**కఠిన చర్యలే శరణ్యం**

టెక్ కంపెనీల తిజోరీలు నింపడానికి మన పిల్లల ప్రాణాలను బలి ఇవ్వలేం. మన విధానకర్తలు వెంటనే నిద్ర మేల్కొని ఆస్ట్రేలియా తరహాలో కఠినమైన నిషేధ చట్టాలను అమలు చేయాలి. కేవలం చట్టాలే కాకుండా, సమాజంలో కూడా అవగాహన పెరగాలి. పిల్లలకు ఆన్‌లైన్ లోకం కంటే నిజ జీవితంలోని మానవీయ సంబంధాలే ముఖ్యమని, వారితో సమయం గడపడం ద్వారా తెలియజెప్పాలి. ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి ఈ డిజిటల్ విషవలయం నుండి బాల్యాన్ని రక్షించకపోతే, రేపటి తరం మానసిక సమస్యల సుడిగుండంలో చిక్కుకోవడం ఖాయం. మన పిల్లల ప్రాణాలు టెక్ కంపెనీల లాభాల కంటే మిన్న అని చాటిచెప్పే సమయం ఆసన్నమైంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ
9848559863

# ప్రచార వాడి తగ్గింది... ఓటు వేడి మొదలైంది

## మున్సిపల్ సమరం.. చివరి అంకం ప్రారంభం

మున్సిపల్ ఎన్నికలు అనేవి కేవలం స్థానిక సంస్థల ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే కావు; అవి పట్టణ ప్రజాస్వామ్యానికి అద్దం పట్టే రాజకీయ–సామాజిక వ్యాయామం. వీటిలో జరిగే ప్రతి దశ ప్రజల దైనందిన జీవన ప్రమాణాలతో నేరుగా ముడిపడి ఉంటుంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, స్థానిక ఆదాయ వనరుల వినియోగం——ఇవన్నీ మున్సిపల్ పాలన ద్వారా అమలవుతాయి. అందువల్ల ప్రచార పర్వం ముగిసిన తర్వాత మిగిలే “పోల్ మేనేజ్‌మెంట్” దశ ఎన్నికల ఫలితాన్ని మాత్రమే కాదు, ప్రజాస్వామ్య నమ్మకాన్ని కూడా ప్రభావితం చేసే కీలక ఘట్టంగా మారుతుంది. ఈ దశలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఎన్నికల యంత్రాంగం, ఓటర్లు——అందరూ తమ తమ బాధ్యతలను ఎలా నిర్వర్తిస్తారన్నది పట్టణ ప్రజాస్వామ్య నాణ్యతను నిర్ణయిస్తుంది. ప్రచార పర్వం ముగిసే వరకు రాజకీయ వాతావరణం ఉత్కంఠభరితంగా ఉంటుంది. అభ్యర్థులు తమ హామీలను, అభివృద్ధి దృక్పథాన్ని ప్రజల ముందుంచుతారు. అయితే ప్రచారం ముగిసిన క్షణం నుంచి ఎన్నికల పోటీ మరొక రూపం దాలుస్తుంది. ఇక్కడే పోల్ మేనేజ్‌మెంట్ అనే పదం ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఇది కేవలం ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం అనే అర్థానికే పరిమితం కాదు; ఓటరు జాబితాల ఖచ్చితత్వం, బూత్ స్థాయి సమన్వయం, ఎన్నికల నియమావళి పాటించడం, పోలింగ్ రోజున శాంతిభద్రతలు కాపాడటం, ఓటింగ్ శాతం పెంచడం వంటి విస్తృత అంశాల సమాహారం. ఈ దశలో జరిగే చిన్న పొరపాటు కూడా ఎన్నికల పారదర్శకతపై అనుమానాలను రేకెత్తించగలదు.

మున్సిపల్ ఎన్నికల్లో బూత్ స్థాయి నిర్వహణ ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల సామాజిక–ఆర్థిక వైవిధ్యం ఎక్కువగా ఉంటుంది. అపార్ట్‌మెంట్ సంస్కృతి, వలస జనాభా, తాత్కాలిక నివాసితులు, ఉద్యోగ నిమిత్తం తరచూ మారే ప్రజలు——ఇవన్నీ ఓటరు జాబితాల నిర్వహణను క్లిష్టతరం చేస్తాయి. ప్రచార దశలో అభ్యర్థులు ప్రజలతో సంబంధాలు పెంచుకోవడంపై దృష్టి పెడితే, పోల్ మేనేజ్‌మెంట్ దశలో ఆ సంబంధాలను ఓటుగా మలచడం లక్ష్యమవుతుంది. అయితే ఇది చట్టబద్ధ మార్గాల్లోనే జరగాలి. డబ్బు, మద్యం, ప్రలోభాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తాయి. ఎన్నికల సంఘం అమలు చేసే నియంత్రణ చర్యలు ఈ నేపథ్యంలో కీలకమవుతాయి.

పోలింగ్ రోజున శాంతియుత వాతావరణం నెలకొల్పడం ఎన్నికల యంత్రాంగానికి పెద్ద సవాల్. పట్టణాల్లో రాజకీయ పోటీ తీవ్రంగా ఉండటం సహజం. స్థానిక ప్రయోజనాలు, కాంట్రాక్టులు, పట్టణ వనరుల నియంత్రణ వంటి అంశాలు ఎన్నికల పోటిని మరింత కఠినతరం చేస్తాయి. అందువల్ల సున్నిత ప్రాంతాల్లో అదనపు భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, మైక్రో ఆబ్జర్వర్లు వంటి చర్యలు అవసరమవుతాయి. పోల్ మేనేజ్‌మెంట్‌లో రాజకీయ పార్టీల పాత్ర కూడా ఇక్కడే పరీక్షకు వస్తుంది. తమ కార్యకర్తలు నియమావళిని పాటించేలా చూడటం, ఉద్రిక్తతలకు తావు ఇవ్వకపోవడం, ఓటర్లను స్వేచ్ఛగా ఓటు వేయనివ్వడం ప్రజాస్వామ్య నిబద్ధతకు సూచిక.




ఓటరు చైతన్యం ఈ దశలో అత్యంత ముఖ్యమైన అంశం. పట్టణాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండటం చాలా కాలంగా ఆందోళనకర అంశంగా ఉంది. చదువుకున్న వర్గాలు, మధ్యతరగతి ప్రజలు ఎన్నికల రోజున సెలవుదినంగా భావించి ఓటింగ్‌కు దూరంగా ఉండటం ప్రజాస్వామ్యానికి నష్టం. ప్రచార పర్వం ముగిసిన తర్వాత పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించే అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్నికల సంఘం, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాఖ్యలు కలిసి ఓటు హక్కు ప్రాముఖ్యతను గుర్తుచేయాలి. పట్టణ అభివృద్ధి నేరుగా మున్సిపల్ పాలనపై ఆధారపడుతుందని ప్రజలు గ్రహించినప్పుడు ఓటింగ్ శాతం సహజంగానే పెరుగుతుంది. సాంకేతికత వినియోగం కూడా పోల్ మేనేజ్‌మెంట్‌లో కీలకంగా మారింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఓటరు ధృవీకరణ వ్యవస్థలు, డిజిటల్ ఓటరు జాబితాలు ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయడమే కాకుండా పారదర్శకతను పెంచుతున్నాయి. అయితే సాంకేతికతపై అపోహలు వ్యాప్తి చెందకుండా స్పష్టమైన సమాచారాన్ని అందించడం అవసరం. ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం నిలబడాలంటే ప్రతి దశలో పారదర్శకత ఉండాలి. అభ్యర్థులు, పార్టీ ప్రతినిధులు, ఎన్నికల అధికారులు పరస్పర సహకారంతో పనిచేసినప్పుడు మాత్రమే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది.

మున్సిపల్ ఎన్నికల పోల్ మేనేజ్‌మెంట్‌లో సామాజిక సమీకరణాలు కూడా ప్రభావం చూపుతాయి. పట్టణాల్లో వర్గాల వారీగా ఓటింగ్ ధోరణులు మారుతూ ఉంటాయి. అభివృద్ధి, స్థానిక సమస్యలు, పౌర సదుపాయాల లభ్యత వంటి అంశాలు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రచారంలో ఇచ్చిన హామీలను పోలింగ్ రోజున గుర్తుచేసే ప్రయత్నం సహజమే. అయితే ఇది నియమావళి పరిమితుల్లో ఉండాలి. ఎన్నికల సంఘం విధించిన మౌన కాలాన్ని గౌరవించడం ప్రజాస్వామ్య నైతికతకు సూచిక.

పోల్ మేనేజ్‌మెంట్ దశలో మీడియా పాత్ర కూడా కీలకం. తప్పుడు వార్తలు, వదంతులు, సోషల్ మీడియా దుష్ప్రచారం ఎన్నికల వాతావరణాన్ని కలుషితం చేయగలవు. బాధ్యతాయుత జర్నలిజం, వాస్తవ నిర్ధారణ, సమతుల్య ప్రసారం ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంలా పనిచేస్తాయి. ముఖ్యంగా పట్టణ యువత సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్న నేపథ్యంలో నిజమైన సమాచారం అందించడం అత్యవసరం. మున్సిపల్ ఎన్నికల అసలు లక్ష్యం పట్టణ పరిపాలనను ప్రజలకు దగ్గర చేయడం. పోల్ మేనేజ్‌మెంట్‌ను కేవలం రాజకీయ వ్యూహంగా కాకుండా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా చూడాలి. ఓటరు స్వేచ్ఛ, పారదర్శక ఎన్నికలు, సమాన అవకాశాలు——ఇవే ఈ దశలో ప్రధాన ప్రమాణాలు. ఎన్నికల ఫలితం ఏదైనా కావచ్చు; కానీ ప్రజాస్వామ్య నమ్మకం నిలబడితేనే వ్యవస్థ బలపడుతుంది. ప్రచార పర్వం ముగిసిన తర్వాతి ఈ నిశ్శబ్ద దశలోనే ఎన్నికల అసలు పరీక్ష జరుగుతుంది. నియమాలు పాటించబడుతున్నాయా? ఓటరు స్వేచ్ఛకు భంగం కలుగుతోందా? ఎన్నికల యంత్రాంగం సమర్థంగా పనిచేస్తుందా? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇక్కడే దొరుకుతాయి.

చివరికి మున్సిపల్ ఎన్నికలు పట్టణ భవిష్యత్తును నిర్ణయించే ప్రజా తీర్పు. పోల్ మేనేజ్‌మెంట్ ఆ తీర్పు స్వచ్ఛంగా వెలువడేలా చేసే వ్యవస్థాత్మక ప్రయత్నం. రాజకీయ పోటీ ఎంత తీవ్రమైనా ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధ పరిమితులు, నైతిక బాధ్యతలు అన్నింటికంటే పైచేయి సాధించాలి. పట్టణ ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, బాధ్యతాయుత పాలన——ఇవన్నీ ఓటు పెట్టే క్షణంలోనే రూపుదిద్దుకుంటాయి. అందుకే ప్రచారం ముగిసిన తర్వాతి ప్రతి క్షణం ప్రజాస్వామ్య పరిపక్వతకు అద్దం పడుతుంది. సమన్వయం, పారదర్శకత, నిబద్ధతతో సాగిన పోల్ మేనేజ్‌మెంట్ మున్సిపల్ పాలనకు బలమైన పునాది వేస్తుంది. ఇదే పట్టణ ప్రజాస్వామ్య విజయానికి అసలు కొలమానం.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్-కాలమిస్ట్
9440595494




# 20వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థికే ప్రజల మద్దతు

**ప్రజాపాలన అజెండాతో ప్రచారం**

**ఇస్లావత్ రాజు నాయక్ కు ఓటర్ల బ్రహ్మరథం**




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** మున్సిపల్ ఎన్నికల వేడి రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇస్లావత్ రాజు నాయక్ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతోంది. ప్రజల సమస్యలే తన ప్రచార అజెండాగా, ప్రజాపాలనే తన లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆయనకు అన్ని వర్గాల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ స్థానికుల సమస్యలను నేరుగా తెలుసుకుంటున్న రాజు నాయక్, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై స్పష్టమైన హామీలు ఇస్తున్నారు. ముఖ్యంగా గతంలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను గుర్తించి, అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారం దిశగా కృషి చేస్తానని భరోసా ఇస్తుండటంతో ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది. యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు భద్రత, పేదలకు సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాహిత విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో కౌన్సిలర్‌గా చురుకైన పాత్ర పోషిస్తానని చెబుతున్నారు. ప్రచారంలో భాగంగా వృద్ధులు, మహిళలు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొంటూ తమ మద్దతు ప్రకటించడం విశేషంగా మారింది. "మా వార్డుకు అందుబాటులో ఉండే నాయకుడు కావాలి... సమస్య చెప్పగానే స్పందించే వ్యక్తి కావాలి" అనే అభిప్రాయంతో ప్రజలు రాజు నాయక్ వైపు మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. ప్రజలతో నిత్యం మమేకమై, వార్డు అభివృద్ధినే ధ్యేయంగా పనిచేస్తానని చెబుతున్న ఇస్లావత్ రాజు నాయక్‌కు ఈ ఎన్నికల్లో ప్రజల మద్దతు మరింత బలపడుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రజలే నా బలగం.. వారి దీవెనలే నా బలం

**27 డివిజన్ లో దూసుకుపోతున్న కారు స్పీడ్**

**మీ సేవా సర్వీస్ ఛార్జీలు ఉచితం**




**మంచిర్యాల, ఫిబ్రవరి9 (నినాదం):** మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 27వ డివిజన్ లో బీఆర్ఎస్ కార్పొరేటర్ అభర్థిగా మద్దె పుష్పలత-చేరాలు ఎన్నికల బరిలో నిలుచుకున్నారు. ప్రచారంలో ప్రజలు బీఆర్ఎస్ కి జై కొడుతున్నారు. డివిజన్ ప్రచారంలో పాల్గొంటూ ముందుకు సాగుతున్నారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు అడుగడుగున ప్రజలు ఘనంగా స్వాగతం పలుకుతున్నారు. అభివృద్ధి అజెండాగా ముందుకు సాగుతుండటంతో బీఆర్ఎస్ లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు సేవ చేసేందుకు అవకాశం కల్పించాలని అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ తోనే అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రచారంలో అమెతో పాటు తెబొగకాసం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి పాల్గొని కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు. లిమీ సేవా సర్వీస్ ఛార్జీలు ఉచితం..

**మద్దె పుష్పలత-చేరాలు**

కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్ గా గెలిపిస్తే డివిజన్ ప్రజలకు మీ సేవా సర్వీస్ ఛార్జీలు ఉచితంగా అందిస్తామని 27వ కార్పొరేటర్ అభ్యర్థి మద్దె పుష్పలతబి చేరాలు పేర్కొన్నారు. పేదింటి ఆడపిల్ల పెళ్లి ఖర్చులకు రూ. 5016 అందిస్తామని తెలిపారు. డివిజన్ లో సీసీ కెమెరాలు, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తాం ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ అందేలా చర్యలు తీసుకుంటాం. అవినీతి లేకుండా నిజాయితీతో ప్రజలకు సేవ చేయడమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తామని పేర్కొన్నారు. నీటి సమస్య లేకుండా, సోలార్ వీధి దీపాలు, ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం .కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

# పొనగండ్ల ఘటనపై న్యాయ విచారణ జరపాలి

**తాహసిల్దార్‌కు**

**వినతి పత్రం అందజేత**



**నల్లబెల్లి, ఫిబ్రవరి 9 (నినాదం):** భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పొనగండ్ల గ్రామంలో ఎనిమిది సంవత్సరాల బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించి దోషులను కఠినాతి కఠినంగా శిక్షించాలని తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు నల్లబెల్లి మండల కేంద్రంలోని మండల రెవెన్యూ తాహసిల్దార్ ముప్పు కృష్ణ సోమవారం విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బట్టు సాంబయ్య మాట్లాడుతూ, అమానుషంగా జరిగిన ఈ ఘటనలో నిందితులను వెంటనే గుర్తించి చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని కోరారు. అత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బాలికకు వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దారుణ సంఘటనలు మళ్లీ జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, సభ్య సమాజం తలదించుకునేలా జరిగిన ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌నుహృదయపూర్వకంగా కోరుతున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పరికిరత్నం, యువ నాయకులు ప్రకాష్, మేరు సంఘం మండల కార్యదర్శి ఓదెల రవి, జితేందర్, ప్రకాష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

**జోగులాంబ జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్**



**గద్వాల ప్రతినిధి, ఫిబ్రవరి9 (నినాదం) :** అలంపూర్ ఆలయాల్లో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అలంపూర్ శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి మహాశివరాత్రి మహోత్సవాలు ఈనెల 14 నుంచి 18 వరకు జరగనున్న నేపథ్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు తాగునీటి కొరత లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరంత రాయంగా విద్యుత్ సరఫరాతో పాటు, లైటింగ్ ఏర్పాట్లు, హెల్త్ క్యాంపు లు నిర్వహించాలన్నారు. తుంగభద్ర నది తీరాన గజ ఈతగాళ్లను నియ మించి, అనుకోని పరిస్థితుల్లో భక్తులను రక్షించడానికి సిద్ధంగా ఉండేలా చూడాలన్నారు. భక్తులకు అవసరమైన సేవలు అందించేందుకు వాలంటీర్లు, ఇతర సేవా సంస్థల సభ్యుల సహకారం తీసుకోవాలన్నారు. వీఐపీలు, ఇతర ప్రజాప్రతినిధులు దర్శనార్థం వచ్చే అవకాశం ఉన్నందున ప్రోటోకాల్ ప్రకారం వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అలంపూర్ ఆలయాల పరిసరాల్లో అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖ తరపున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును నియమిస్తున్నట్లు చెప్పారు. మహిళా భక్తుల సౌకర్యార్థం అదనంగా మహిళా కానిస్టేబుల్స్ ను నియమించనున్నట్లు పేర్కొన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు తమ పోలీస్ సిబ్బంది ఇతర శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో పని చేస్తారని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, అలంపూర్ ఆలయాల కార్య నిర్వహణాధికారి దీప్తి, తహసిల్దార్ మంజుల, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నినాదం మార్కెట్ NINADAM MARKET

# బంగారం ధరలు మరింత చౌకగా మారతాయా..

**కొనుగోలు చేసేటప్పుడు ఈ విషయాలు తెలుసుకోండి**



సోమవారం బంగారం ధరలు మళ్లీ పంజుకున్నాయి. గత కొద్దికాలంగా కొనసాగుతున్న తగ్గుదలకు బ్రేక్ పడింది. డాలర్ బలహీనడపటం, ప్రపంచ ఉద్రిక్తతలు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లలో కోత విధించనుందనే వార్తల నడుమ జనవరి 9న గోల్డ్ రూ. 1.57 లక్షలకు చేరుకోగా.. వెండి రూ. 2.61 లక్షలు క్రాస్ చేసింది. గోల్డ్ ధర రూ. 1310 పెరగ్గా.. సిల్వర్ రేటు ఒకేసారి రూ. 15 వేలు పెరిగింది. పసిడి ధరల్లో భారీగా ఒడిదొడుకులు నమోదవుతున్న ఈ తరుణంలో బంగారం కొనుగోలు చేయవచ్చా..? లేదా మరికొంతకాలం వేచి ఉండాలా..? అనే ఆందోళన చాలామందిలో కలుగుతుంది. దీనిపై మార్కెట్ నిపుణులు ఏమంటున్నారంటే..?

**సడెన్‌గా ఈ పెరుగుదల ఎందుకు..?**

సోమవారం పసిడి ధరలు పెరగడానికి ప్రపంచ అంశాలు ప్రభావితం చూపించాయి. ఫిబ్రవరి 4 తర్వాత యూఎస్ డాలర్ కనిష్ట స్థాయికి చేరుకుంది. డాలర్ బలహీనపడినప్పుడు బంగారం, వెండి ధరలు ఇతర కరెన్సీలతో విదేశీ కొనుగోలుదారులకు చౌకగా లభిస్తుంది. దీని వల్ల బంగారానికి డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్ దౌత్యవేత్త అమెరికాతో అణు చర్చలు జరిపినట్లు వార్తలు వచ్చినప్పటికీ.. యురేనియం సుసంపన్నత హక్కును వదలుకునేది లేదని ఇరాన్ స్పష్టం చేసింది. దీంతో గోల్డ్ రేట్లలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇక అమెరికా యూఎస్ ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించనుందనే అంచనాలు వెలువడుతున్నాయి. డాలర్ బలహీనపడటంతో వడ్డీ రేట్లలో ఒకటి లేదా రెండు శాతం కోత విధించనుందనే సంకేతాలు వినిపిస్తున్నాయి. వడ్డీ రేట్లు తగ్గడం వల్ల బంగారం వంటి వడ్డీ రాని ఆస్తులను కలిగి ఉండటం పెట్టుబడిదారులకు మరింత లాభదాయకంగా ఉంటుంది. దీని వల్ల బులియన్ మార్కెట్ బుల్లిష్ ట్రెండ్‌లో వెళుతుంది.

**పెట్టుబడులకు ఇది మంచి అవకాశమా..?**

ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా పసిడి ధరలు కొంతకాలం స్థిరంగా కొనసాగవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇక వెండికి స్థిరమైన పారిశ్రామిక డిమాండ్, నిర్మాణాత్మక సరఫరా లోటు ధరలు తగ్గకుండా నిరోధిస్తుంది. ఇక ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు బంగారం ఎక్కువగా కొనుగోలు చేయడం, ద్రవ్య విధానాలను సడలించే సంకేతాలతో బులియన్ మార్కెట్ ట్రెండ్ సానుకూలంగా ఉండవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా ప్రస్తుతం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఫిబ్రవరి డెలివరీ పూర్తయ్యే బంగారం ధర 1.31 శాతం పెరిగి 10 గ్రాముల ధర రూ. 1.57 లక్షల వద్ద కొనసాగుతోంది. ఇక మార్చి డెలివరీ వెండి ధర 4.81 శాతం పెరిగి రూ. 2.61 లక్షల వద్ద కొనసాగుతోంది. సోమవారం వెండి ధరల 6 శాతం పెరిగాయి.

# దేశ ప్రజలకు షాకింగ్ న్యూస్..

**పెరగనున్న పెట్రోల్, డీజిల్ ధరలు..?**

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగనున్నాయా..? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంతో రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం భారత్ నిలిపివేసింది. రష్యా అతి తక్కువ ధరకే మనకు చమురు అందిస్తోంది. ఇప్పుడు అది ఆగిపోవడంతో త్వరలో ధరలు పెరిగే అవకాశముంది. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ డీల్‌లో భాగంగా భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై ట్రంప్ సుంకాలను తగ్గించారు. ఇక భారత్ దిగుమతి చేసుకునే అమెరికా ఉత్పత్తులపై కూడా టారిఫ్‌లను భారీగా తగ్గించింది. దీంతో ఇరు దేశాలకు ప్రయోజనం జరగనుంది. అమెరికా నుంచి మనం దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు తగ్గనున్నాయి. ఇక్కడ నుంచి అమెరికా వస్తువులను ఎగుమతి చేసేవారికి ట్యాక్సులు తగ్గనున్నాయి. దీంతో పరిశ్రమలకు కూడా బెనిఫిట్ జరగనుంది. అయితే ఈ ఒప్పందంలోని ఓ నిబంధన వల్ల దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే ప్రమాదముందని బిజినెస్ అనలిస్టులు చెబుతున్నారు. వాటి వివరాలేంటో చూద్దాం.

**పెట్రోల్ ధరలు పెరుగుతాయా..?**

రష్యా నుంచి భారత్ చమురు ఎక్కువగా కొనుగోలు చేస్తుంది. రష్యా తక్కువ ధరకే మనకు చమురు అందిస్తోంది. కానీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దని ట్రంప్ కోరగా.. దీనికి భారత్ అంగీకరించింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించి అమెరికా, వెనిజులా నుంచి మాత్రమే పెద్ద మొత్తంలో కొనుగోలు చేయాలని ట్రంప్ నిబంధన విధించారు. ఒకవేళ నిబంధన ఉల్లంఘించి రష్యా నుంచి కొంటే 25 శాతం సుంకం విధిస్తామంటూ ట్రంప్ హెచ్చరించాడు. దీనికి భారత్ ఆమోదం తెలపడంతో రష్యా నుంచి తక్కువ ధరకు లభించే చమురు ఆగిపోనుంది. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు దేశంలో పెరుగుతాయనే వార్తలు వినిపిస్తున్నాయి. భారత్ దాదాపు 85 శాతం చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. గత కొన్ని సంవత్సరాలుగా భారత్‌కు రష్యా నుంచి ఎక్కువగా చమురు సరఫరా అవుతుంది. చమురు దిగుమతుల్లో భారత్ మూడింట ఒక వంతు వాటా కలిగి ఉంది.




**తగ్గింపులు ఇప్పటికే ప్రారంభం**

రష్యా నుంచి ఇప్పటికే చమురు కొనుగోలు చేయడం భారత్ తగ్గించింది. ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్ లాంటి ప్రభుత్వ ఆధ్వర్యంలోని కంపెనీలు వెనిజులా వైపు మొగ్గు చూపుతున్నాయి. ఇక రిలయన్స్ కూడా వెనిజులా నుంచి కొనుగోలు చేయడం కోసం ఆర్డర్ ఇచ్చింది. రష్యా భారతదేశానికి అత్యంత తక్కువ ధరకు చమురును అందిస్తోంది. గతంలో ఈ తగ్గింపు బ్యారెల్‌కు వి7 నుండి వి8 వరకు ఉండేది. కానీ ఇప్పుడు వి11కి పెరిగింది. అమెరికా, వెనిజులా నుంచి కొంటే బ్యారెల్‌కు కనీసం వి7 ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుంది. షిప్పింగ్ ఖర్చులు కూడా పెరగనున్నాయి. దీని వల్ల పెట్రోల్ దిగుమతి చేసుకునే కంపెనీలకు అదనపు ఖర్చు అవుతుంది. దీంతో పెట్రోల్ ధరలను పెంచి ప్రజలకు ఆయిల్ కంపెనీలు భారం మోపే అవకశముందని విశ్లేషకులు చెబుతున్నారు.




**త్వరలో కొత్త యాప్.. ఒక్కక్లిక్‌తో..**

కేంద్ర ప్రభుత్వం త్వరలో ఉద్యోగులకు గుడ్‌న్యూస్ తెలపనుంది. యూపీఐ యాప్ ద్వారా పీఎఫ్ నగదును ఉపసంహరించుకునే సౌకర్యాన్ని ప్రవేశపెట్టందుకు రంగం సిద్దమైంది. ఇందుకోసం కొత్త యాప్‌ను రూపొందిస్తోంది. ఈ యాప్ ద్వారా పీఎఫ్ ఎలా విత్ డ్రా చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.
ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ కోట్లాది మంది పీఎఫ్ ఖాతాదారులకు ఊరట కలిగించే విషయం తెలిపింది. త్వరలో యూపీఐ విత్ డ్రా సౌకర్యాన్ని తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోంది.

# పీఎఫ్ విత్ డ్రాపై కేంద్రం కీలక అప్డేట్..

ప్రస్తుతం కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ఈ ప్రాజెక్ట్‌పై వర్క్ చేస్తుండగా.. ఏప్రిల్ 1 నుంచి దీనిని అందుబాటులోకి తీసుకురానుందని తెలుస్తోంది. దీంతో దీని కోసం దేశవ్యాప్తంగా ఉన్న కోట్లామంది ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు పీఎఫ్ విత్ డ్రా చేసుకోవాలంటే ఈపీఎఫ్‌వో వెబ్‌సైట్లోకి వెళ్లి డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. క్లెయిమ్‌కు దరఖాస్తు చేశాక అకౌంట్లో జమ చేయడానికి చాలా ఆలస్యమవుతుంది. ఇప్పటినుంచి ఇవన్నీ అవసరం లేకుండా ఒకేచోట అన్నీ సేవలు లభించనున్నాయి.

**పీఎఫ్ కొత్త యాప్..**

ఈపీఎఫ్ సేవలన్నీ ఒకేచోట పొందేందుకు కేంద్రం కొత్త యాప్‌ను తీసుకురానుంది. యూపీఐ ద్వారా పీఎఫ్ విత్ డ్రా చేసుకోవడంతో పాటు పాస్‌బుక్ బ్యాలెన్స్, ఇతర సేవలు అన్నీ ఇక్కడ ఒకేచోట పొందవచ్చు. ఈ కొత్త యాప్‌లో యూపీఐ ఆప్షన్ ద్వారా పీఎఫ్ అకౌంట్లోని నగుదును విత్ డ్రా చేసుకోవచ్చు. యూపీఐ ద్వారా మీ బ్యాంక్ అకౌంట్లోకి నేరుగా నగదు జమ అవుతాయి. ఇక ఈ యాప్‌లోనే మీ పీఎఫ్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. అలాగే ఇతర సేవలు కూడా ఇక్కడే పొందవచ్చు. దీంతో ఈపీఎఫ్ చందాదారులు వేర్వేరు వెబ్‌సైట్లు, మొబైల్ అప్లికేషన్లను సందర్శించాల్సిన అవసరం ఉండదు.

**ఎలా విత్ డ్రా చేసుకోవాలంటే..?**

ప్రస్తుత నిబంధనల ప్రకారం ఈపీఎఫ్ సభ్యులు తమ ఖాతా వివరాలను యాక్సెస్ చేయాడానికి లేదా సేవలకు ఈపీఎఫ్‌వో పోర్టల్, ఉమాగ్ యాప్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ కొత్త యాప్‌లో అన్నీ సేవలు ఒకేచోట యాక్సెస్ చేయవచ్చు. ఈ యాప్‌లో పీఎఫ్ బ్యాలెన్స్‌ను చెక్ చేసుకోవచ్చు. అనంతరం పీఎఫ్ విత్ డ్రా ఆప్షన్ సెలక్ట్ చేసుకుని యూపీఐను ఎంచుకోవాలి. యూపీఐ పిన్‌ను ఎంటర్ చేస్తే మీ బ్యాంక్ అకౌంట్లోకి నిధులు ట్రాన్స్‌ఫర్ అవుతాయి. కొత్త పీఎఫ్ యాప్ ప్రస్తుతం టెస్టింగ్ దశలో ఉండగా.. ఏప్రిల్‌లో దీనిని లాంచ్ చేసేందుకు కార్మికశాఖ సిద్దమవుతోంది.

# నాచారం డివిజన్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**కాప్రా, ఫిబ్రవరి 9 (నినాదం) :** నాచారం సర్కిల్ నాచారం డివిజన్లో 4 కోట్ల 66 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాచారం డివిజన్ మరియు హెచ్ఎంటి నగర్ డివిజన్లో సమానంగా అభివృద్ధి చేయనున్నట్లు కార్పొరేటర్ తెలియజేశారు. హెచ్ఎంటి నగర్ లో 70 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారితో కలిసి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువును సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువును 30 కోట్ల రూపాయలతో సుందరీకరించనున్నట్లు తెలిపారు. నాచారంలో దోమల సమస్యకు శాశ్వత పరిష్కారం జరుగుతుందని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ సూరజ్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి

**కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్**



**మల్కాజిగిరి, ఫిబ్రవరి 9 (నినాదం):** గౌతమ్ నగర్ డివిజన్ సమగ్రాబివృద్ధికి కృషి చేస్తున్నామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతరామ్ యాదవ్ అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్ సాయిబాబా ఆలయం సమీపంలో సోమవారం 21 లక్ష రూపాయలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్ లోని అన్ని కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ దివ్య జ్యోతి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర కుల సర్వే చేసిన ఆశ వర్కర్లకు అందని పారితోషికం



**అల్వాల్, ఫిబ్రవరి 9 (నినాదం):** కాంగ్రెస్ ప్రభుత్వం గత సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణన సర్వే కు నమోదు చేయడం ఆశ వర్కర్లు అంగన్వాడి వర్కర్లు ఎంతో కృషి చేశారని వారికి తగిన పారితోషకం అందలేదని ప్రాథమిక ప్రభుత్వ ఆసుపత్రి అల్వాల్ సూపర్వైజర్ అరుణడిప్యూటీ కమిషనర్ భోగేశ్వరులకు విన్నవించారు. తమ ఆసుపత్రి లోని ఆశ వర్కర్లు అంగన్వాడి వర్కర్లు 9 మందికి ఎలాంటి సహాయం అందలేదని పై అధికారులతో చర్చించి తగు సహాయం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో అరుణ జ్యోతి, చంద్రిక, కిష్టమ్మ, జ్యోతి, పాల్గొన్నారు.

# ముగిసిన 'మునిసిపల్' ప్రచారం

**ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించొద్దు**

**ఎస్పీ స్నేహ మెహ్రా ఐపిఎస్**




**వికారాబాద్, ఫిబ్రవరి 9(నినాదం):** వికారాబాద్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలకు నిర్వహిస్తున్న మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు ప్రవర్తనా నియమావళి ప్రకారం సోమవారం సాయంత్రం ఐదు గంటలతో ఎన్నికల ప్రచారం ముగుస్తుందని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ తెలిపారు. ప్రచారం ముగిసిన అనంతరం అమల్లోకి వచ్చే ప్రచార నిషేధ కాలం సైలెన్స్ పీరియడ్ సమయంలో ఏలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారం, మైకులు, లౌడ్ స్పీకర్లు, ప్రచార వాహనాలు, పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఇతరాత్ర ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి అనుచరులు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అదేవిధంగా సైలెన్స్ పీరియడ్ సమయంలో సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా ఏ లాంటి ఎన్నికల ప్రచారం, అభ్యర్థులకు అనుకూలంగా, వ్యతిరేకంగా సందేశాలు పంపడం నిషేధమని తెలిపారు. ఈ అంశంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఉల్లంఘనలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ రోజు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వయ వాతావరణంలో జరగేలా జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించడం జరిగింది అని, ఫ్లయింగ్ స్క్వాడ్స్ క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు, అక్రమ మద్యం రవాణా, నగదు పంపిణీ, బెదిరింపులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు సూచనలు చేస్తూ, ఎన్నికల నిబంధనలను గౌరవించి, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు సహకరించాలని, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు అధికారులకు సమాచారం అందించాలని ఆమె కోరారు.

# దయాకర్ రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**ఎస్సీ ఎస్టి కమిషన్, మానవ హక్కుల కమిషన్‌లను ఆశ్రయించిన బాధితులు**



**వికారాబాద్, ఫిబ్రవరి 9(నినాదం):** తమ కూతురు మరణానికి కారణం అయినా బిఆర్ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అనూష తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు సోమవారం అంబేద్కర్ ప్రజా సంఘం అండతో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్ లలో వారు దయాకర్ రెడ్డి పై ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదులో వివరాల ప్రకారం పెద్దెముల్ మండలం, చైతన్య నగర్ కు చెందిన మాదాసు లక్ష్మి కిష్టయ్య దంపతులు వారి కుమార్తె అనూష (14) తో కలిసి గత కొంతకాలంగా నవాబుపేట మండలం ముబారక్ పూర్ గ్రామంలో దయాకర్ రెడ్డి వద్ద పొలం పనులు చేస్తూ అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో గత జనవరి 28వ తేదీ పొలం పనుల నిమిత్తం ట్రాక్టర్ పై వెళుతుండగా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన ప్రమాదంలో అనూష అక్కడికక్కడే మరణించింది. 14 సంవత్సరాలు నిండని అనూషను బలవంతంగా దయాకర్ రెడ్డి పని చేయించుకోవడం వల్లనే ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మమత అనే మరో మహిళ కాలు విరిగింది. ప్రమాదం జరిగిన నాటి నుండి మమత తో పాటు మరో ముగ్గురిని దయాకర్ రెడ్డి రహస్య ప్రదేశంలో బంధించి వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ సంఘటనలో తనకు అనుకూలంగా చెప్పాలని వేధిస్తుంటే అతని నిర్బంధంలో ఉన్న గంగమ్మ అనే మహిళ తప్పించుకుని గ్రామానికి చేరుకుంది. తమకు అతను ఇచ్చే కూలీ డబ్బులు సరిపోవని వాటిని పెంచాలని, లేకుంటే వారి గ్రామానికి వెళతామని చెప్పిన వారి కులాన్ని, పేదరికాన్ని ఆసరాగా చేసుకొని బెదిరించి పనులు చేయించుకునేవాడు. ఈ విషయంలో పోలీసులు ప్రమాదంగా మాత్రమే కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారన, కానీ ఒక ఎస్టీ బాలిక బాల కార్మికురాలితో పని చేయించుకోవడం నేరమనే విషయాన్ని వారు పరిగణలోకి తీసుకోలేదని, పైగా ట్రాక్టర్ డ్రైవర్ వెంకట్ రెడ్డి పై మాత్రమే కేసు నమోదు చేశారని వారు పేర్కొన్నారు. కానీ ఈ ఘటనకు పూర్తి బాధ్యుడు దయాకర్ రెడ్డి. అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, బాల కార్మికురాలితో పని చేయుచున్నందుకు కేసు నమోదు చేయాలని, అతని నిర్బంధంలో ఉన్న మరో ముగ్గురిని విడిపించాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం మాట్లాడుతూ చట్టాలను ఉల్లంఘించి బాల కార్మికులతో పని చేయించుకుని, ఆమె మరణానికి కారణం అయినా దయాకర్ రెడ్డి పై ఖచ్చితంగా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు పేదవారి సంక్షేమం కోసం పనిచేయాలని, సంపన్నులకు అండగా నిలుస్తూ పేదలకు అన్యాయం చేయకూడదని అన్నారు. దయాకర్ రెడ్డి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసే వరకు న్యాయబద్ధమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం తాండూర్ డివిజన్ కార్యదర్శి బుడగ జంగం వెంకటేష్, చైతన్య నగర్ గ్రామస్తులు బుచ్చయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# మైక్రోబయాలజీ గోల్డ్ మెడలిస్ట్‌కు ఎమ్మెల్యే సహకారం

**ఎమ్మెల్యే సూచనతో సరస్వతీ పుత్రుడికి 1.30 లక్షల ఆర్థిక సహాయం అందించిన లైన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్**



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 9 (నినాదం):** మైక్రోబయాలజీ డిగ్రీలో గోల్డ్ మెడల్ సాధించిన నిరుపేద సరస్వతీ పుత్రుడు శ్రీపతి ఉదయ్ కుమార్‌కు ఆస్ట్రేలియాలోని ఆర్ ఎం ఐ టి యూనివర్సిటీలో మైక్రోబయాలజీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుకునే అవకాశం లభించింది. శ్రీపతి ఉదయ్ కుమార్ కు సరస్వతీ కటాక్షం లభించిన కావలసిన (లక్ష్మీదేవి కటాక్షం లేకపోవడంతో) ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు ఆటంకం ఏర్పడడంతో స్థానిక శాసనసభ్యులు, బిఆర్ఎస్ఎల్పి. విప్ కె.పి వివేకానంద ను ఆర్థిక సహాయం కోసం ఆశ్రయించారు. విద్యార్థి అభ్యర్థనకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ సభ్యులకు విషయం తెలియజేశారు. ఎమ్మెల్యే సిఫారసు కు స్పందించిన లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం ఉదయం రూ. 1.30 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తాను సిఫారసు చేసిన మూడు రోజులలోనే విద్యార్థికి అండగా నిలిచేందుకు ముందుకు రావడం ఎంతో సంతోషదాయకమని, అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాగే పేద విద్యార్థులకు సహకారం అందించాలని లయన్స్ క్లబ్ సభ్యులను కోరారు. నియోజకవర్గంలో పేద విద్యార్థులు వైద్య, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యను పూర్తి చేసుకునేందుకు తన వంతుగా ఎల్లప్పుడూ ఆర్థిక సహాయం అందిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు ఆంజనేయులు, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ విజయ్ కుమార్ శెట్టి, సీనియర్ సభ్యులు చల్లా శ్రీనివాస రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, కోలా వెంకటేష్ ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, నరసింహులు గౌడ్, బాలరాజు, ప్రవీణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి పైపులైను లీకేజీని త్వరలో అరికడతా..

**జలమండలి మేనేజర్ సాయి చరిత్ర**



**అల్వాల్, ఫిబ్రవరి 9 (నినాదం):** ఫాదర్ బాలయ్య నగర్ నుండి కిష్టమ్మ ఎంక్లేవ్ వరకు తాగునీటి పైప్‌లైన్‌కు తరచూ లీకేజీలు ఉండటం వలన (రీప్లేస్మెంట్) పైపులను మార్చడానికి సిద్ధంగాఉన్నామని జలమండలి అధికారిని మేనేజర్ సాయి చరిత తెలిపారు సోమవారం ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు అల్వాల్ సిఐ శంకరయ్య తో కలిసి పనులగురించి చర్చించినట్లు ఆమె తెలిపారు. త్వరలో పనులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. పని రోజులలో ట్రాఫిక్ ను డైవర్స్ చేసేందుకు సహకారం కావాలని ఆమెవారిని కోరారు స్పందిస్తూ ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో ఉంటారని ముందుగా తెలియపరచాలని వారు విన్నవించారు. ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు , సీఐ శంకరయ్య ల పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటించాలి





**బాక్స్ డ్రైన్ పనులకు ఎమ్మెల్యే, కార్పొరేటర్ శంకుస్థాపన**

**అల్వాల్, ఫిబ్రవరి 9 (నినాదం):** అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారంఅల్వాల్ డివిజన్‌లో రూ. 2.3 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రెయిన్ పనులకుశంకుస్థాపన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి. కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి చేశారు. అల్వాల్ డివిజన్ పరిధిలోని ,దినకర్ నగర్‌లో చిన్నరాయుడు చెరువు నుండి వెంకటాపురం కల్వర్టు వరకు రూ. 2.3 కోట్ల వ్యయంతో చేపడుతున్న బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, వర్షాకాలంలో తరచూ ఎదురయ్యే వరదలు మరియు నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ఈ బాక్స్ డ్రెయిన్ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ డ్రెయిన్ నిర్మాణం పూర్తయితే పరిసర కాలనీల్లో నీరు నిలిచే సమస్య పూర్తిగా తొలగిపోతుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండదని, నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే. కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు అల్వాల్ సర్కిల్ డి.ఈ. ప్రశాంతి, ఎ.ఈ. అరుణ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానికులు లక్ష్మీనారాయణ రంగారావు స్వాత్విక్ లోకేష్ రాజేశ్వర చారి జీవన్ మొహినద్దీన్ ప్రేమ్ కుమార్ యాదగిరి గౌడ్, మహేష్ ,సాజిద్, సెల్వ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి నగర్ శివాజీ చౌక్ వద్ద ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

**ఉప కమిషనర్‌కు బిజెపి నేతల వినతి**




**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 9 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 281 డివిజన్ రంగారెడ్డి నగర్ సర్కిల్లో ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని చింతల్ సర్కిల్ ఉప కమిషనర్ లావణ్య కు బిజెపి నేతలు వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి నగర్ చుట్టూ పెద్ద పారిశ్రామిక వాడ ఉండడంతో నిత్యం వేలాది మంది కార్మికులు, లేబర్ పనిచేస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడం కొరకు ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ క్యాంటీన్ రంగారెడ్డి నగర్ శివాజీ చౌక్ వద్ద ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఇన్చార్జులు నందన దివాకర్, బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు పరిష వేణు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, శ్యామ్, గజానంద్, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడోత్సవాలు






**మేడ్చల్ మల్కాజ్గిరి, ఫిబ్రవరి 9 (నినాదం):** తెలంగాణ ప్రభుత్వం , స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో చీఫ్ మినిస్టర్ కప్ 2025 జిల్లా స్థాయి క్రీడోత్సవాలు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్ లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయేందర్ రెడ్డి అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ , మమత తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఓ ఎస్ డి, ఐ. విజయ కుమారి జిల్లా విద్యాశాఖ అధికారి, పిఈటిల తో ప్రారంభించారు. ఈ కార్యక్రమాలు వరుసగా సోమవారం నుండి జరిగిన పోటీలు కబడ్డీ, వాలీబాల్, కో కో, ఫుట్బాల్ అండ్ సైక్లింగ్ నిర్వహించడం జరిగింది. సుమారు 500 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పంపించడం జరుగుతుంది అని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతి (మొదటి బహుమతి ఒక లక్ష రూపాయలు, రెండో బహుమతి 75000, మూడో బహుమతి 50,000) ఉంటుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జ యువజన క్రీడల శాఖ అధికారి తెలిపారు.

# కాలనీలలోని సమస్యల పరిష్కారానికి కృషి

**కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి**



**మల్కాజిగిరి, ఫిబ్రవరి 9 (నినాదం):** నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీ లలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నేరేడ్ మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్ పరిధిలోని చిన్న కందిగూడలో ఆదివారం 26 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్ల పనులను నేరేడ్ మెట్ డివిజన్ కార్పొరేటర్ కొతపల్లి మీనా ఉపేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలను స్థానిక నాయకుల ద్వారా తన దృష్టి కి తీసుకువస్తే, వెంటనే సంబందిత అధికారులతో మాట్లాడి, సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొతపల్లి ఉపేందర్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ ఆదిత్య, సత్యనారాయణ, శ్యామ్, సాయి, ఆకారం సాయి, రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలే నా బలం, వారి నమ్మకమే నా ప్రేరణ

**ఎమ్మెల్యే కె.పి. వివేకానంద**



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 9 (నినాదం) :** ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయ దిశగా భావించే ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ పేటబషీరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన రోజువారీ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని ప్రజల మనసులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అంశాన్ని ఓపికగా విని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని వేగంగా పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఆయన భరోసా ఇచ్చారు. సామాజిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వానాలను కూడా ప్రజల నుంచి స్వీకరించి, ప్రతి కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మరింత దగ్గరగా ఉండాలన్న తన సంకల్పాన్ని వెల్లడించారు. ప్రజలే నా బలం, వారి నమ్మకమే నా ప్రేరణ" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలతో పాటు నడుస్తూ సేవ చేయడమే తన ధ్యేయమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల నాయకులు, సభ్యులు, వివిధ కాలనీ వాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

# బాలాజీనగర్ చాత్తాద వైష్ణవ సంఘం నూతన అధ్యక్షునిగా లక్ష్మణాచారి



**జవహర్‌నగర్, ఫిబ్రవరి 9 (నినాదం):** చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బాలాజీ నగర్ లో సోమవారం నూతన చాత్తాద సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా వకులాభరణం లక్ష్మణాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా విజయపురి కృష్ణమూర్తి, రాధావరం అర్చన, కార్యదర్శిగా హరిపురి వెంకటస్వామి, సంయుక్త కార్యదర్శిగా పరాంకుశం, సాంప్రదాయ కార్యదర్శిగా హరిపురి అనిల్ ,కోశాధికారిగా తిరునగరి సింహాచలం ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడ్డ కార్యవర్గ సభ్యులకు బంధువులు బాలాజీ నగర్ శాఖ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వకులాభరణం లక్ష్మణాచారి మాట్లాడుతూ నామీద ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని చాత్తాద వైష్ణవ సంఘ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర చాత్తాద వైష్ణవ సంఘం సభ్యులు వకులాభరణం భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడ్డ చాత్తాద వైష్ణవ సంఘం సభ్యులు వాపులాభరణం భాస్కర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### అభివృద్ధికోసం మేము మతం పేరుతో

# కాంగ్రెస్, ఎంఐఎం కుమ్మక్కు

**45 స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం తథ్యం**

**కబ్జాలు, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతా**

**ఒక్క ఛాన్స్ ఇవ్వండి మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించండి**

**కాంగ్రెస్ గెలిస్తే మేయర్ పీఠం ఎంఐఎం**

**కాంగ్రెస్, ఎంఐఎం మధ్య లోపాయికారీ ఒప్పందం**

**కరీంనగర్ తీగలగుట్టపల్లి, చింతకుంట ఎన్నికల ప్రచార సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్**



**కరీంనగర్, ఫిబ్రవరి 9(నినాదం):** కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో వార్ వన్ సైడ్ గా మారిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార చివరి రోజైన సోమవారం రోజున కరీంనగర్ లోని తీగలగుట్టపల్లి, చింతకుంటలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో పాల్గొని 2వ డివిజన్ అభ్యర్థి కొలగాని శ్రీనివాస్, 3వ డివిజన్ అభ్యర్థి సాధినేని లావణ్య, 14వ డివిజన్ అభ్యర్థి గుంజేటి శివకుమార్, 15వ డివిజన్ అభ్యర్థి సోమిరెడ్డి కరుణలను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సీహెచ్.విఠల్ తోపాటు స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్న ఈ మీటింగ్ లో బండి సంజయ్ మాట్లాడుతూ,మొత్తం 66 డివిజన్లకుగాను బీజేపీ 45 స్థానాలను కైవసం చేసుకోవడం తథ్యమన్నారు. మేయర్ పీఠం బీజేపీకి అప్పగిస్తే...కరీంనగర్ ప్రజల రక్షణ కవచంగా మారి భూకబ్జాదారులు, డ్రగ్స్ అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు.ఆర్వోబీ పనులకు ఆలస్యంలో మొదటి దోషి కాంగ్రెస్ పార్టీ. గతంలో ఈ ఆర్ వో బి కోసం నేను రూపాయిలు 110 కోట్లు నాలుగేళ్ల కిందట మంజూరు చేయించుకొచ్చాను. బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకుండా కిరికిరి పెడితే. .. ఇక వీళ్ళతో నీ లాభం లేదని కేంద్రం నుంచి సేతుబంధు పథకం కింద మొత్తం రూపాయలు 154 కోట్లు నేనే మంజూరు చేయించుకొచ్చాను. దాంతోనే ఈ పనులు జరుగుతున్నాయి. కానీ ఈ పనులు ఆలస్యంగా అవడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వం. చేపట్టాల్సిన భూసేకరణను కావాలని ఆలస్యం చేస్తూ మనల్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ ప్రజలందరికీ తెలుసు బండి సంజయ్ ఎంత కృషి చేశారో. అన్నారు. అందరికి తెలుసు కరీంనగర్ రైల్వే స్టేషన్ ని రూపాయలు 29 కోట్లతో సుందరంగా ఆధునికరించాను. అంతే కదా ఈ తీగలు గుట్టపల్లి చౌరస్తా నుంచి. పాత గ్రామపంచాయతీ స్కూల్ మీదుగా ఎస్ఆర్ఆర్ కళాశాల వరకు వెళ్లే రోడ్డును విస్తరించి కొత్త రోడ్డును వేయించాను. 3వ డివిజన్ లో అమృత 2.0 తాగునీటి పైప్లైన్ల నిర్మాణము పనులు రూపాయలు 132 కోట్లతో కరీంనగర్ కార్పొరేషన్కు నేను తెచ్చిన నిధులతో ఈ పనులు జరుగుతున్నాయి. విద్యారణ్యపురిలోని ప్రతిరోడ్డును స్మార్ట్ సిటీలో నేనే వేయించాను. స్మార్ట్ సిటీలో లైటింగ్ పెట్టించి రాత్రివేళలో ఏ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాను. నేను చాలాసార్లు కాంట్రాక్టర్ తో పాటు అధికారులను పై ఆగ్రహం వ్యక్తం చేశాను పలుమార్లు సమీక్షలు పెట్టాను. ఇక్కడికి వచ్చి పనులను పరిశీలించాను. ఈ ఎన్నికలు అయిపోగానే వీలైనంత తొందరగా ఈ ఆర్ వో బి సమస్యను తీర్చి మీ బాధల్ని పూర్తిగా తొలగించే బాధ్యత నాది. ఇదే కాదు ఈ తీగల గుట్టపల్లి చౌరస్తా నుంచి ప్రతిమ ఆస్పత్రి వరకు ఈ రోడ్డును వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాను. కరీంనగర్ ఎన్నికల్లో కరీంనగర్ లో బీజేపీ గెలుపు పక్కా. 66 డివిజన్లలో 45 స్థానాల్లో బీజేపీ గెలవబోతోంది. ప్రజలంతా ఇప్పటికే డిసైడ్ అయ్యారు. ఈ సారి వార్ వన్ సైడే. కుట్రలు.. పైసల పార్టీ.. కాంగ్రెస్. భూ దందాలు బద్నాం పార్టీ బీఆర్ఎస్. మోసాల, మాయల, మత ఉన్మాద పార్టీ ఎంఐఎం. మీకు అండగా ఉండి అభివృద్ధి చేసే పార్టీ బీజేపీ. కరీంనగర్ లో ఎలాగూ గెలవమని .. పైసల సంచులు దిగినయట.. తీసుకోండి.. ఎంత ఇచ్చినా. అదంతా మన వద్ద దోచుకున్న సొమ్ము. ఇన్నాళ్లు దాచుకుని ఇప్పుడు ఇస్తున్నారు. వాళ్లు మనీ నీ నమ్ముకున్నారు.

# ఏక్ వికాస్.. సబ్ క.. సత్తై నాష్..!










**రెండు పార్టీల క్యాడర్ చిన్నభిన్నం.!**

**జీవన్ రెడ్డికి పెరిగిన సానుభూతి..**

**బిఆర్ఎస్ లో పైసల పంచాయితీ**

**జగిత్యాల ప్రతినిధి ఫిబ్రవరి 9 నినాదం:** రాష్ట్ర మున్సిపల్ పోరులో జగిత్యాల నియోజకవర్గం విచిత్ర కర సన్నివేశం. ఎవరు ఏ పార్టీ ఓటరుకు తెలియని దుస్థితి. 25 ఏళ్లు కాంగ్రెస్ జెండా మోసి సొంత ఆస్తిగా భావించిన కార్యకర్త పుర పోరులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా దర్శనమిస్తున్నారు. 15 సంవత్స రాలు కారు గుర్తుకు ఓటేయమని టిఆర్ఎస్ కండువా వేసుకున్న నాయ కులు ఓవర్ నైట్ మూడు రంగుల కండువా వేసుకుని చేతి గుర్తుకు ఓటేయమని ఇంటింటా ప్రచారం చేస్తున్న సన్నివేశం ఓటరును తికమక పెడుతుంది. కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మరో అడుగు ముందుకేసి పార్టీ అంతర్గత వ్యవహారాల్లోకి వెళ్లి తన వెంట ఉన్న టిఆర్ఎస్ క్యాడర్ కు కాంగ్రెస్ బీ ఫామ్ లు ఇప్పిచ్చుకోవడంలో సక్సెస్ అయ్యారు. నేరుగా గాంధీ భవన్ కి వెళ్లి పిసిసి అధ్యక్షులతో కూర్చొని మున్సిపల్ బీఫాంలో అంశాన్ని మాట్లాడటం మాజీ మంత్రి జీవన్ రెడ్డి జీర్ణించుకోలేక పోయారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంత్రులు ఏమీ చేయలేక ఎమ్మెల్యే సంజయ్ కు మద్దతు ఇస్తూ బీఫాంలో అంట కట్టారు. న్యాయస్థానాలకు దొరకకుండా నేను బిఆర్ఎస్ ఎమ్మెల్యేనే అంటూ కాంగ్రెస్ను గెలిపించాలని ప్రచారం చేస్తూ విస్మయానికి గురి చేస్తున్నారు ఎమ్మెల్యే వెంట ఉన్న క్యాడర్కు గులాబీ కండువా తొలగించి కాంగ్రెస్ కండువా వేసి బీ ఫామ్ లు చేతికిచ్చి మున్సిపల్ పోరు లో దించారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి 45 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో కాంగ్రెస్ పార్టీ తనని ఒంటరి చేసిందని ఇండిపెండెంట్ అభ్యర్థులతో మున్సిపల్ పోరులో ప్రచారం చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అంటే జీవన్ రెడ్డి అనే ఒక నానుడి కి అలవాటు పడ్డ ఓటరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాంగ్రెస్ తో కలిసి పని చేస్తే పర్వాలేదు కానీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతి గుర్తు తో ప్రచారం చేయడాన్ని ఓటరు అంగీకరించడం లేదు. చివరి అంకంలో జీవన్ రెడ్డిని పార్టీ ఇబ్బందుల గురిచేస్తూ వైశాచిక ఆనందం అనుభవిస్తున్నారు అంటూ మహిళలు తిరగబడుతున్నారు. అభివృద్ధి ఉంటే చేసుకోండి కానీ పెద్దమనిషి ప్రాణంతో చెలగాటమాడుతున్నారంటూ పబ్లిక్ గానే విమర్శలు చేస్తున్నారు. గడిచిన రెండేళ్లలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దాదాపు 200 కోట్ల కాంట్రాక్టు పనులు చేశారు. ప్యాకేజీలుగా విభజించి తన వియ్యంకుని అనుబంధ సంస్థకు అంటగట్టి ఈ ప్రాంత కాంట్రాక్టర్లకు ఒక్క రూపాయి దక్కకుండా చేశారనే ప్రధాన విమర్శ ఉంది. కాంగ్రెస్ అధిష్టానం ఫిరాయింపు ఎమ్మెల్యేకు అధిక ప్రాధాన్యత ఇచ్చి జగిత్యాల ప్రాంతాల్లోని కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాల మీద దెబ్బ కొట్టిందని చర్చ నడుస్తుంది. అలాగే బి ఆర్ఎస్ కార్యకర్తలు కూడా కాంగ్రెస్ పార్టీ అంటే ఇష్టం లేకున్నా ఎమ్మెల్యే ఒత్తిడితో మూడు రంగుల కండువా వేసుకొని మున్సిపల్ బరిలో ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తల చేతి గుర్తును అధిష్టానం ఫిరాయింపు దారులకు కట్టబెట్టడంతో ఇండిపెండెంట్ లు గా మారారు. దీంతో జీవన్ రెడ్డి వారి పక్షాన నిలబడి అన్యాయం జరిగిందంటూ ఇల్లు ఇల్లు తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. నిన్నటి వరకు గులాబీ కండువా కప్పుకుని తిరిగిన నాయకులంతా మూడు రంగుల జెండా వేసుకొని చేతులు చేతి గుర్తు పట్టుకొని ప్రచారం చేస్తుంటే ఓటర్ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇక బి ఆర్ఎస్ పరిస్థితి మరీ అధ్వానం. బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్ కుమార్ వెంట ప్రధాన క్యాడర్ దాదాపు 50 మంది ఉండగా గతంలో మున్సిపల్ కౌన్సిలర్ గా గెలిచి వారికి కాంగ్రెస్ బీఫామ్ ఇచ్చి బరిలో దింపారు. మిగిలిన వారు టిఆర్ఎస్ లోనే ఉన్నారు. మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావసంత సురేష్ కి జగిత్యాల నియోజకవర్గం బిఆర్ఎస్ క్యాడర్ కు నాయకత్వం వహిస్తున్నారు. అసలు క్యాడరే చెల్లాచెదురైనచోట మున్సిపల్ కౌన్సిల్ బరిలో అభ్యర్థులను వెతికి 50 వార్డులగాను నలభై తొమ్మిది వార్డుల కు అభ్యర్థుల నియమించారు. అలాగే రాయికల్ మున్సిపాలిటీలో కూడా అతి కష్టం మీద బి ఆర్ఎస్ అభ్యర్థులు పోటీపడుతున్నారు. జగిత్యాల ప్రాంతానికి చెందిన ఎమ్మెల్సీ ఎల్ రమణ క్యాడర్ పూర్తిగా కనుమరుగయింది.. రమణ సామాజిక వర్గం కూడా కాంగ్రెస్, బిజెపిగా విడిపోయింది. ఎమ్మెల్సీ ఎల్ రమణకు టి ఆర్ఎస్ అధ్యక్షులు విద్యాసాగర్ రావు మధ్య డబ్బుల విషయంలో వాగ్వివాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. జగిత్యాల ప్రాంతానికే వచ్చే ఎల్ రమణకు నియోజక వ ర్గం టిఆర్ఎస్ పై అవగాహన లేక కేవలం డబ్బు మూటలతో అభ్యర్థులను ఇబ్బంది పెట్టడం కోసం ప్రయత్నం చేస్తున్నారంటూ రాయి కల్ మున్సిపల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత చోటుచేసుకుంది. పోటీలో ఉన్న అభ్యర్థులు ఖర్చుల కోసం ఎమ్మెల్యే రమణను సంప్రదిస్తే అనేక రకాలైన ప్రశ్నలు వేసి తులసి పత్రి చేతుల పెట్టి పంపిస్తున్నారని ఇవి దేనికి పనికొస్తాయి అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో టిఆర్ఎస్ అభ్యర్థులను బరిలోదించిన దావ సంత సురేష్ లపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేతనైతే పూర్తి పెత్తనం చేయాలి అని నిరసన వ్యక్తం చేస్తున్నారు. పక్క పార్టీ అభ్యర్థుల ముందు పరువు తీస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ ఎంపీ అరవింద్ బహిరంగ సభతో బిజెపి లో ఊపు వచ్చింది. గెలుపు అభ్యర్థులను కొంతమందిని చూసి వార్డులను పరిశీలించి వ్యూహాత్మ కంగా బరిలో దించారు. వారికి ఆర్థిక వేసలు బాటు అందించి ఇన్చార్జి బోగ శ్రావణి ప్రచారంలో ఉన్నారు. ఈ పుర పోరులో పార్టీ అభ్యర్థుల కంటే ఇండిపెండెంట్ అభ్యర్థులే ఎన్నికలను ఎక్కువ ప్రభావితం చేస్తున్నట్లు ఇప్పుడున్న సమీకర ణాలు చెబుతున్నాయి. పురపోరులో నెలకొన్న ఈ రాజకీయ అనిచ్చితికి ఒక సంజయ్ కుమార్ కు కాంగ్రెస్ అధిష్టానం ఫెవర్ చేయడంతో అన్ని పార్టీలు ఎఫెక్ట్ అయ్యాయి. ఏక వికాస్ సబ్కా సత్త నాష్ అంటూ ప్రచారం జరుగుతుంది

## నూతన ఎస్సై అనిల్ని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



**మల్లాపూర్, ఫిబ్రవరి 09 (నినాదం) :** మల్లాపూర్ నూతన ఎస్సై గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎస్సై అరకాల.అనిల్ ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎండి జమాల్, బొర్రగల్ల రవి,జక్కంపల్లి శేఖర్, అల్లిపురం సాయి, శీలం రవి, ఎండి చందు, కోడిపిల్లి అభి పాల్గొన్నారు.

## 24వ వార్డు ప్రజల ఆశీర్వాదం రాగారవళికే



**జమ్మికుంట, ఫిబ్రవరి 9 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ బలపరి చిన అభ్యర్థి రాగా రవళి తన ప్రచారాన్ని చివరి రోజు విస్తృతంగా నిర్వహించారు. వార్డులో ఎక్కడికి వెళ్లినా ఆమెకు సం పూర్ణ మద్దతు తెలుపు తూ ఓటు వేస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. వార్డులో విద్యావేత్త అయిన రవళికి వార్డు ప్రజల నుండి మంచి రెస్పాన్స్ రావడం వారు ఆమెను ఆశీర్వదించి గెలిపిస్తామని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. సింహం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె చేసిన ప్రచారానికి ప్రజల నుండి విశేష స్పందన రావడంతో తన గెలుపు పై ఆమె ధీమాతో ఉన్నారు.

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలించిన ఆర్డీవో



**మెట్పల్లి, ఫిబ్రవరి 9 (నినాదం):** మున్సిపల్ రెండవ సాధారణ ఎన్నికల సందర్భంగా మెట్పల్లి పట్టణంలోని ఎస్సారెస్పీ క్యాంపు ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ను మున్సిపల్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో శ్రీ ఎన్. శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, పోలింగ్ సామగ్రి పంపిణీ, ఎన్నికల సిబ్బంది హాజరు, భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నీతా, మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ గారు, ఆర్వోలు మీర్జా అజ్మతుల్లా బేగ్, ముజీబ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామ నిర్మాణానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

### -సర్పంచ్ బొల్లంపల్లి అజయ్‌కుమార్

**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 9 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ అధ్యక్షతన గ్రామసభ ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విన్న సర్పంచ్, ప్రభుత్వం నుండి నిధులు అందిన వెంటనే గ్రామంలోని మౌలిక సదుపాయాల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని తెలిపారు. ముఖ్యంగా పారిశుధ్య పనులు, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ వంటి అంశాల్లో గ్రామస్తులు బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రతి ఇంటి నుండి భాగస్వామ్యం ఉండాలని సూచించారు. ఈ గ్రామసభలో ఉప సర్పంచ్ బోడిగె శ్రీనివాస్, గ్రామ పంచాయితీ కార్యదర్శి గుడికందుల మధు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లంపల్లి సుకుమార్, కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన హరికృష్ణ యాదవ్, బొల్లంపల్లి రాజు, అంబాల శ్రీనివాస్, సీతంపేట శ్రీనివాస్, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ఘోర వైఫల్యం

**గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ సిటీ పేరుతో భారీ అవినీతి జరిగింది**

**బీజేపీ,బీఆర్ఎస్ లోపాయి కారి ఒప్పందం**

**ఏఐఎఫ్బి రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి**



**కరీంనగర్, ఫిబ్రవరి 9(నినాదం):** ఉమ్మడి కరీంనగర్లో ఫార్వర్డ్ బ్లాక్ మెజారిటీగా 26 సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేసిన ఏఐఎఫ్బీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి సోమ వారం రోజున పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశం లో జోజి రెడ్డి, మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని, బీజేపీ, బీఆర్ఎస్ లోపాయి కారి ఒప్పందం చేసుకుందాని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. సంక్షే మ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ప్రజల కోసం ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అలాగే బీజేపీ నేత బండి సంజయ్ కార్పొరేషన్కు ఎన్ని నిధులు తీసుకొచ్చారో ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. బిజెపికి ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అత్యధికంగా స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ సిటీ పేరుతో భారీ అవినీతి జరిగిందని, ఆ దోపిడీని ప్రజలు ప్రత్యక్షంగా చూశారని విమ ర్శించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేశాయని అన్నారు. అనంతరం ఏఐఎఫ్బి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ, కరీంనగర్ ఉనది జిల్లాలో 10 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్ లో 132 చోట్ల ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, ప్రజలు సరైన ఆలోచనతో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడగడానికి వస్తే ప్రజలు ప్రశ్నించాలని, తగిన విధంగా స్పందించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో అవినీతి పార్టీలను నీలదీసి, నిజమైన ప్రత్యామ్నాయంగా, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులకు ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, జాగృతి అధ్యక్షులు గుంజపాడుగు హరిప్రసాద్, ఫార్వర్డ్ బ్లాక్ నగర అధ్యక్షులు సత్యారావు, నాయకులు ముత్యాల విజయ్ కుమార్, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు వరాల శ్రీనివాస్, సుధా వైష్ణవి, రాజు కుమార్ , శీలం శ్రీనివాస్, జాగృతి నాయకులు జూతది శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జగిత్యాలలో... కరపత్రం కలకలం!

**జగిత్యాల ప్రతినిధి ఫిబ్రవరి 9 నినాదం:** జగిత్యాల జిల్లా కేంద్రంలో ఓ కరపత్రం కలకలం రేపింది. సామాన్య ఓటర్ పేరుతో రిలీజ్ చేసిన ఈ కరపత్రంలో ఓటర్ తన ఆవేదనను వ్యక్తం చేస్తూ విడుదల చేశారు సోమవారం దాదాపు ఐదువేల కరపత్రాలను దినపత్రికల ద్వారా ప్రతి ఇంటికి చేరే విధంగా ప్లాన్ చేశారు. ఈ కరపత్రంలో ఏముందంటే.. జగిత్యాల మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తు మీద పోటీ చేస్తున్న 35 మంది అభ్యర్థులు కాంగ్రెస్ అభ్యర్థులు కాదని ప్రజలను పార్టీని మోసం చేసి పోటీలో ఉన్నారని పొందుపరిచారు. 35 మందికి కాంగ్రెస్ పార్టీ అక్రమంగా బీఫాంలో అంట కట్టిందని వీరంతా గత 15 ఏళ్ల నుంచి బి ఆర్ ఎస్ పార్టీలో కరుడుగట్టిన నాయకులని రాత్రికి రాత్రే కాంగ్రెస్ నాయకులు ఎలా అయిపోతారని ఈ కరపత్రంలో పొందుపరిచారు జగిత్యాల పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న ఈ 35 మంది అభ్యర్థుల మోసాలను గమనించి ఓటు ద్వారా తీర్పు చెప్పాలని విజ్ఞప్తి చేశారు ఇట్లు సామాన్య ఓటర్ అంటూ ఎరుపు కలర్ లో ప్రింట్ చేసిన కరపత్రం దినపత్రిక ద్వారా పంపిణీ చేశారు ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి అనుమానితులిద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

## 20వ వార్డు ప్రచారంలో దూసుకెళ్తున్న గుర్రం కావ్య

### -కమలం గుర్తుకు ఓటు వేయాలని విస్తృత ప్రచారం



**జమ్మికుంట, ఫిబ్రవరి 9 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు లో బిజెపి బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి గుర్రం కావ్య పరశురాములు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. సోమవారం ఇంటింట ప్రచారం నిర్వహించిన కావ్య పరశురాములు తమను గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేస్తామని ఓటర్లకు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యానికి వార్డు అభివృద్ధికి నోచుకోలేదని బిజెపి బలపరిచిన తమను భారీ మెజార్టీతో వార్డు ప్రజలు గెలిపిస్తే బండి సంజయ్ సహకారంతో కేంద్రం నిధులు తీసుకొచ్చి వార్డును అభివృద్ధి చేస్తానని వారు ప్రజలకు హామీ ఇచ్చారు. ఒకసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే నాయకుడిగా కాకుండా సేవకుడిగా సేవలు అందిస్తామని వారు తెలిపారు. తమ ఏ ఇంటికి వెళ్లిన వార్డు ప్రజలు ఆదరించి అక్కున చేర్చుకుంటున్నారని వారి ఆశీస్సులతో గెలుపు దిశగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

## రెండు రోజులు మద్యం దుకాణాల బంద్



**జమ్మికుంట, ఫిబ్రవరి 9 (నినాదం) :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జమ్మికుంట పట్టణంలో సోమవారం సాయంత్రం ఐదు గంటల నుండి బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు రెండు రోజుల పాటు వచ్చే దుకాణాలను మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఐదు గంటల తర్వాత జమ్మికుంట పట్టణ ఎక్సైజ్ పోలీసులు పట్టణంలోని మద్యం దుకాణాలను మూసివేసి సీల్ వేశారు. తిరిగి బుధవారం సాయంత్రం ఐదున్నర గంటలకు మద్యం దుకాణాలు తెరవనున్నట్లు తెలిపారు.

## పోలింగ్ సందర్భంగా ప్రచార కార్యక్రమాలపై నిషేధం

**పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా మద్యం దుకాణాలు మూసివేయాలి**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, ఫిబ్రవరి 9(నినాదం):** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న పరిధిలో సోమవారం సాయంత్రం 5 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9 తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ నిర్వహించే కేంద్రాల్లో ఈ నెల 10, 11 తేదీల్లో సెలవు ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలుగా ఉన్న విద్యా సంస్థలు, కార్యాలయాలకు ఈ సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కార్పొరేషన్లు, సంస్థల ఉద్యోగులు, సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున (ఈ నెల 11న) సెలవు వర్తిస్తుందని కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రశాంత ఎన్నికలకు పోలీసుల పటిష్ట ఏర్పాట్లు



**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ రాములు**

**మెట్పల్లి, ఫిబ్రవరి 9 (నినాదం):** మెట్పల్లి, కోరుట్ల పట్టణాల్లో ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మెట్పల్లి డీఎస్పీ రాములు కోరారు. సోమవారం సబ్‌డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈరోజు సాయంత్రం 5 గంటలతో ఎన్నికల ప్రచారం ముగు స్తుందని తెలిపారు. తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం 2019లోని సెక్షన్ 209 ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి ఎలాంటి ఎన్నికల ప్రచారా నికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ నిబంధనల ప్రకారం ప్రజాసభలు, ర్యాలీలు, ఊరేగింపులు, టెలివిజన్, సినిమా, ఇతర ఎలక్ట్రానిక్ మీడియా, మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిషేధ మని చెప్పారు. సంగీత, నాటక, వినోద కార్యక్రమాల ద్వారా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు కూడా చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా సంయమనం పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన నాన్‌లోకల్ నాయకులు పట్టణాల ను విడిచి వెళ్లాలని ఆదేశించారు. ఇందు కోసం అర్ధరాత్రి వరకు లాడ్జీల్లో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలు సీసీ కెమెరాల పర్యవే క్షణ లో ఉండగా, పోలింగ్ కేంద్రాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐ అనిల్‌కుమార్, మెట్‌పల్లి ఎస్సై కిరణ్, కోరుట్ల ఎస్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా ఎన్నికలపై సీఎం సమీక్ష



**ధర్మపురి ఫిబ్రవరి 09( నినాదం ):** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల సన్నాహకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో నిర్వహించిన సమీక్ష సమావేశం ప్రభావం ఇప్పుడు ధర్మపురి పట్టణ రాజకీయాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. సోమవారం ఉదయం జూమ్ మాధ్యమం ద్వారా ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో ఎన్నికల వ్యూహాల పై చర్చించారు. గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అధిష్టాన సూచనలతో స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ఎన్నికల వ్యూహాలను వేగవంతం చేసిందని పట్టణంలోని ప్రతి వార్డులో పార్టీ బలాబలాలపై సమీక్షలు చేసినట్లు మంత్రి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రికి పేర్కొన్నట్టు సమాచారం. ప్రచార కార్యక్రమాలతో పాటు ఓటర్లను నేరుగా కలుసుకుంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలపై స్థానిక నాయకత్వం దృష్టి సారించిందని తెలిపినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ప్రచార గడువు సోమవారంతో ముగిసిన నేపథ్యంలో నేతలపై ఒత్తిడి పెరిగిం ది. ప్రతి ఓటరును కనీసం ఒక్కసారైనా కలవాలని, ఒక్క ఓటు కూడా చేజారనివ్వొద్దని పీసీసీ నుంచి నేతలకు అంతర్గ తంగా సూచనలు వెళ్లినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రెబెల్స్ ప్రభావం ఉండే వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఓట్ల చీలికె నివారించేందుకు చర్యలు జరుపుతు న్నట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల బరిలో నిలిచిన రెబెల్ అభ్యర్థులను బుజ్జగించి, పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇప్పిం చే ప్రయ త్నాలు కూడా కొనసాగుతున్నాయి. మంత్రి అడ్లూరి తో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలని సూచించినట్లు సమాచారం. ఎన్నికల్లో విజయం సాధిం చడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అన్ని స్థాయిల్లో కసరత్తు వేగవంతం చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్లపై బిటీజేఎఫ్ హెచ్చరిక

**అశ్వాపురం, ఫిబ్ర వరి 9( నినాదం):** జర్నలిస్టులకు అక్రిడిటే షన్ కార్డులు జారీ విషయంలో ప్రభుత్వం తారతమ్యాలు చూపకుండా, గతంలో అమలులో ఉన్న విధానాన్నే కొనసాగించి అర్హులైన వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల రామ్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అశ్వాపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత నిబంధనలను సడలించి చిన్నాపెద్దా మీడియా సంస్థల మధ్య తేడా లేకుండా జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమంతో పాటు సీఎం కార్యాలయ ముట్టడికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

# మున్సిపోల్స్‌కు పటిష్ట బందోబస్తు..

## నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

### ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జిల్లాలో ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసిందని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. ప్రశాంత, నిష్పక్షపాత ఎన్నికలే జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండి ఫలితాలు ప్రకటించే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. మొత్తం ఎన్నికల ప్రక్రియను కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, ఎలక్షన్ సెల్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాలు కీలక ప్రాంతాలు సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రచార గడువు 9న సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని తెలిపారు. ఆ తరువాత అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఎవరూ కూడా ప్రచారం నిర్వహించరాదని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదైతే అభ్యర్థిత్వం కోల్పోయే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరించారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుండి ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు సైలెన్స్ డేగా పరిగణిస్తామని తెలిపారు. ఈ సమయంలో స్థానికేతరులు, ఓటర్లు కానివారు కాలనీలు, వార్డుల్లో సంచరించరాదని సూచించారు. ఓటర్లను డబ్బు, మద్యం, బహుమతులతో ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు ఎలాంటి భయాలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలను కోరారు.



## ఫిర్యాదు బాక్సుల సమస్యల పరిష్కారానికి కృషి

### సర్పంచ్ ఎల్పుల సరిత



**మహాదేవపూర్ ఫిబ్రవరి 9, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన ఫిర్యాదు బాక్సులో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తానని సర్పంచ్ ఏల్పుల సరిత తెలిపారు. ప్రతి సోమవారం ఫిర్యాదు బాక్స్ తెరిచి ఫిర్యాదులను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ఆమె సోమవారం బాక్స్ లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించగా గ్రామంలో మద్యం అమ్మకాల నిషేధం, నేతకాని కాలనీలో కరెంటు స్తంభం ఏర్పాటు చేయాలని కోరినట్లు ఫిర్యాదు బాక్సుల్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం అమ్మకాల విషయంలో గ్రామంలోని కిరాణా దుకాణాలు యజమానులతో మాట్లాడి మద్యం అమ్మకం నిలిపివేయాలని సూచించినట్లు వివరించారు. కరెంటు స్తంభం ఏర్పాటుపై విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. అనంతరం గ్రామసభ నిర్వహించి గ్రామంలోని పలు సమస్యలను తెలుసుకొని అంగన్వాడి భవన కోసం ప్రత్యేక గ్రామసభ నిర్వహించి తీర్మానం చేసినట్లు తెలిపారు. గ్రామ సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, వార్డు సభ్యులు సంతోష్, తేజస్విని, శ్రీజ, మనక్క, వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి స్వాతి పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

### ప్రజాదివాస్‌లో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజాదివాస్‌లో జిల్లా వ్యాప్తంగా వచ్చిన పిర్యాదుదారుల నుండి మొత్తం 10 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

## కేటీఆర్‌పై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



**కమలాపూర్, ఫిబ్రవరి 9 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పై బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి ఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు మీద చర్యలు తీసుకోవాలని టి పి సి సి ఉపాధ్యక్షులు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆదేశాల మేరకు సోమవారం కమలాపూర్ పోలీస్ స్టేషన్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దూడ శ్రీకాంత్, మాజి సర్పంచ్ మాట్ల రవీందర్, ఇల్లంతకుంట దేవస్థానం డైరెక్టర్ మరిపెల్లి గూడెం సమ్మక్క సారలమ్మ చైర్మన్ రిక్కల నారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు కొండ తిరుపతి, మాట్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పనులు ప్రారంభించని ఇందిరమ్మ ఇండ్లు రద్దు చేయబడతాయి

**కమలాపూర్, ఫిబ్రవరి 9 (నినాదం):** మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు నేటికి పనులు ప్రారంభించని వారు రెండు రోజుల్లో పనులు ప్రారంభించాలని లేకుంటే అవి రద్దు చేయబడుతాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి బాబు తెలిపారు. సోమవారం గ్రామపంచాయతీ పరిధిలోని 12వ వార్డు, 16వ వార్డులలో గల ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వము మంజూరు చేసినటువంటి ఇందిరమ్మ ఇండ్లను ఇప్పటికి ప్రారంభించని లబ్ధిదారులు రెండు రోజులలో ప్రారంభించని పక్షంలో వాటిని రద్దు పరుస్తామన్నారు. 44 మంది లబ్ధిదారులు నేటికీ పనులు ప్రారంభించలేదని తెలిపారు. అదేవిధంగా బేస్మెంటు, బేస్మెంట్ కంటే తక్కువ స్థాయిలో ఉన్న గృహాలన్నీ కూడా ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కోరారు. లెంటల్ లెవెల్, రూఫ్ లేవల్ లో ఉన్న లబ్ధిదారులు వారం రోజులలో స్లాబు పూర్తి చేసి ప్లాస్టరింగ్, రంగులు వేసుకోవాలన్నారు. స్లాబు పూర్తయిన లబ్ధిదారులు ప్లాస్టరింగ్, రంగులు వేసుకోవాలన్నారు. వివిధ స్థాయిలలో పూర్తి చేసిన వారికి వెంటవెంటనే ప్రభుత్వము నిధులు నేరుగా వారి ఖాతాలోకి విడుదల చేస్తున్నదని, నిధులకు కొరత లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నరేష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధిహామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

### సర్పంచ్ చల్ల సమ్మిరెడ్డి



**మహాదేవపూర్ ఫిబ్రవరి 9, (నినాదం):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కుదురుపల్లి సర్పంచ్ చల్ల సమ్మిరెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చి ప్రజల ఉపాధి హక్కును కాలరాస్తున్న విషయాన్ని కూలీలకు వివరించారు. గ్రామపంచాయతీలకు రాజ్యాంగ బద్ధంగా లభించిన అధికారులను నిర్వీర్యం చేస్తుందని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తీసుకువచ్చిన వి బి జి రామ్ జి గ్రామీణ ప్రజల జీవితాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యశోద రవి, వార్డు మెంబర్లు సోయం శశికాంత్, మాదరి మధుకర్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## చిన్నారుల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య కీలకం

### • కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 9 (నినాదం):** పిల్లల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య చాలా కీలకమని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మర్రిగూడ మండలం, సరంపేట గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్వాడి స్కూలును సందర్శించి పిల్లలతో మాట్లాడి చదువు పౌష్టికాహారం వివరాలు అడిగి తెలుసుకొని, అక్షరాలు--సంఖ్యలు చెప్పిస్తూ ప్రోత్సహించారు. పిల్లల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య ఎంతో కీలకమని , వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఎప్పటికప్పుడు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడుతూ ఏం తిన్నారు? ఏం పెట్టారు? అని అడిగారు. దానికి పిల్లలు సమాధానం చెప్తూ పప్పు పెట్టారు అని చెప్పారు. ఏ ఫర్ ఆపిల్, బి ఫర్ బాల్, సి ఫర్ క్యాట్ ,డి ఫర్ డాగ్అని . 1 నుండి 20 వరకు అంకెలు అడిగారు. ఆయన వెంట తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, సిపిడిఓ సక్కుబాయి ,మునుగోడు సిడిపీవో అంగన్వాడి టీచర్ తదితరులు ఉన్నారు.



## క్రీడాకారులకు స్పోర్ట్స్ టి షర్టులు పంపిణీ



**కమలాపూర్, ఫిబ్రవరి 9 (నినాదం):** సీఎం కప్‌లో భాగంగా మండల స్థాయిలో గెలుపొంది జిల్లా స్థాయిలో పాల్గొంటున్న కమలాపూర్ మండల క్రీడాకారులకు సోమవారం హనుమకొండలోని జెఎన్ఎస్ క్రీడా ప్రాంగణంలో సుమారుగా వంద మంది క్రీడాకారులకు దాతల సహకారంతో స్పోర్ట్స్ టీ షర్ట్ లను మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు పంపిణీ చేశారు.

## పల్లె దవాఖాన ఆకస్మిక తనిఖీ

**చింతపల్లి, ఫిబ్రవరి 9(నినాదం):** మండలంలోని కుర్మపల్లి గ్రామంలో ఉన్న పల్లె దవాఖానాను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పుట్ల శ్రీనివాస్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాక్సిన్ రిజిస్టర్, మందుల నిల్వలను పరిశీలించారు. సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారినైనా సహించేది లేదని ఆయన హెచ్చరించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వంశీకృష్ణ ,సూపర్వైజర్లు పద్మ, ఎ ఎన్ ఎం. లు జయమ్మ,గాయత్రి,రవికిరణ్ , ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



## కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

### 164 మంది విద్యార్థినులకు ఉద్యోగావకాశం

**కోదాడ, ఫిబ్రవరి 9 (నినాదం):** కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ళపల్లి గాంధీ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఉత్పత్తి రంగ సంస్థలు ప్రీమియం సోలార్ రేడియంట్, ఫోక్స్‌కాన్, లార్సన్ అండ్ ట్యూబ్రో ఆధ్వర్యంలోని కంపెనీలు ఈ ఎంపికల్లో పాల్గొన్నాయి. మానవ వనరుల ప్రతినిధుల పర్యవేక్షణలో జరిగిన నియామకాల్లో మొత్తం 164 మంది కిట్స్ విద్యార్థినులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినులకు వార్షికంగా రూ.4 లక్షల వరకు వేతనం అందించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ నాగార్జున రావు, టీపీవో పుష్పలతతో పాటు అధ్యాపకులు అభినందించారు.




## రిపబ్లిక్ డే పరేడ్ విద్యార్థి విశ్వాస్ తేజ్‌కు ఘన సన్మానం

**నర్సంపేట, ఫిబ్రవరి 9 (నినాదం):** వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్ నగర్ సైనిక్ స్కూల్ విద్యార్థి విశ్వాస్ తేజ్ న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో రిపబ్లిక్ డే పరేడ్ చేసినందున సైనికస్కూల్ ప్రిన్సిపల్ గట్ల సురేందర్ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తమ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి విశ్వాస్ తేజ్ సుమారు 8 ఎన్ సీసి క్యాంపుల్లో పాల్గొని, ఇతర బెటాలియన్ విద్యార్థులతో ఎంతో పోటీని ఎదుర్కొని రిపబ్లిక్ డే పరేడ్ కి ఎన్నికవ్వడం తమ సైనిక్ స్కూల్‌కు గర్వకారణమని అన్నారు. న్యూఢిల్లీలో సుమారు నెల రోజులు ట్రైనింగ్ మరియు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఇతర సైనిక పటాలాలతో కలిపి గౌరవ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ,భారత ప్రధాని నరేంద్ర మోడీ , ఇతర విదేశీ ప్రతినిధుల సమక్షంలో పరేడ్‌లో పాల్గొనడం తమ సైనిక్ స్కూల్ యొక్క ప్రతిష్టను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లాడని సంతోషిస్తున్నామన్నారు. విశ్వాస్ తేజ్ ను ఇతర విద్యార్థులు స్ఫూర్తి పొందాలనే ఉద్దేశంతో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో డైరెక్టర్ దామోదర్ రెడ్డి, డిగ్రీ వైస్ ప్రిన్సిపల్ అనూష, స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ సుజాత ,ఇతర ఉపాధ్యాయ ఉపాధ్యయేతర సిబ్బంది, విద్యార్థులు విశ్వాస్ తేజను అభినందించారు.



## ఘనంగా జాడి మల్లన్న బోనాల జాతర





**మహాదేవపూర్ ఫిబ్రవరి 9,(నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో జాడి మల్లన్న బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. శ్రీ జాడి మల్లన్న బోనాల జాతర సందర్భంగా సోమవారం మహాదేవపూర్ తో పాటు పలు గ్రామాల నుండి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి జాడి మల్లన్న స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజారులు జాడి శ్రీశైలం, జాడి గట్టయ్య, వెంకయ్య, సమ్మయ్య, గట్టయ్య, రాజేందర్, రేగుల భాస్కర్, లక్ష్మి దేవర పూజారులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పలువురు స్వామివారి ని దర్శించుకున్నారు. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకొని జాడి మల్లన్న స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోరికలు తీర్చే జాడి మల్లన్న స్వామి వారికి నైవేద్యంగా పెట్టి ప్రసాదంగా స్వీకరించారు. ప్రతి ఇంట పాడిపంటలు పిల్లాపాపలు ఆరోగ్యంగా చల్లంగా చూడాలని జాడి మల్లన్న స్వామివారిని వేడుకున్నారు.

జాడి మల్లన్న బోనాల జాతర సందర్భంగా ఆలయంలో మల్లన్న పట్నాలు ముగ్గులు శివశక్తుల పూనకాలు పోతరాజు భూలక్ష్మి దేవర విన్యాసాలు భక్తుల కోలాహలంతో జాతర ప్రాంగణం మార్మోగింది. జాడి బోనాల జాతర సందర్భంగా స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## రూ.5 వేల ఆర్థిక సహాయం



**కమలాపూర్, ఫిబ్రవరి 9 (నినాదం):** మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన బొనగాని కనక లక్ష్మి ఈ మధ్య కాలంలో మృతి చెందారు. ఆమె కుటుంబానికి అదే గ్రామానికి చెందిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాయినేని తిరుపతిరావు సోమవారం 5 వేల రూ ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్ రావు, గౌడ సంఘం అధ్యక్షులు బోనగాని శ్రీనివాస్, కురుమ సంఘం మండల అధ్యక్షులు కొనుపుల రామ్ చందర్, గౌడ సంఘం నాయకులు తిరుపతి , మాజీ ఎంపీటీసీ అరుణా క్రాంతి కుమార్ ,మాజీ వార్డు సభ్యులు మేడిపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న బోనాలలో సర్పంచ్ హసీనాబాను



**మహాదేవపూర్ ఫిబ్రవరి 9, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో సోమవారం జరిగిన మల్లన్న బోనాలు స్థానిక సర్పంచ్ హసీనాబాను ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని , రైతుల కు పంటలు అధిక దిగుబడులు రావాలని భగవంతుని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ గడ్డం స్వామి, నెన్నెల గట్టయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఏఈఓ నిర్లక్ష్యంతో ఖానాపురం రైతుల అవస్థలు

**కోదాడ, ఫిబ్రవరి 9 (నినాదం):** ఖానాపురం గ్రామంలో ఏఈఓ అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా యాప్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలపై సంప్రదించినా ఏఈఓ వినోద్ ఫోన్‌లకు స్పందించడంలేదని రైతులు వాపోతున్నారు. సోమవారం మీడియా సమావేశంలో ఉపసర్పంచ్ జగన్ మాట్లాడుతూ... యాప్ టెక్నికల్ సమస్యలపైపలుమార్లు ఫోన్ చేసినా ఎలాంటి స్పందన లేదని తెలిపారు. ప్రజా ప్రతినిధిని నాకే స్పందించకపోతే గ్రామంలో సామాన్య రైతుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. తక్షణమే మండల వ్యవసాయ అధికారులు వెంటనే చొరవ చూపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఏవో సతీష్ ని వివరణ కోరగా... ఉప సర్పంచ్ జగన్ ఈ విషయం తమ దృష్టికి తీసుకువచ్చారని, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళామని తెలిపారు.



## విద్యాసంస్థలకు నేడు, రేపు సెలవు

### కలెక్టర్ బి.చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 9 (నినాదం):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆయా మున్సిపాలిటీల పరిధిలోని విద్యాసంస్థలన్నింటికీ ఈనెల 10, 11 తేదీలలో 2 రోజులు స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్ర శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్, మిర్యాలగూడ హాలియా, నందికొండ, చండూరు, దేవరకొండ, చిట్యాల, మున్సిపాలిటీల పరిధిలోని అన్ని విద్యాసంస్థలకు ఇది వర్తిస్తుందని ఆయన తెలిపారు. అలాగే మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు వినియోగించుకుంటున్న అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలకు, ఇతర పబ్లిక్ బిల్డింగ్స్ అన్నింటికీ పోలింగ్ ముందు రోజైన ఫిబ్రవరి 10, పోలింగ్ రోజైన ఫిబ్రవరి 11 న స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## 11న వేతనంతో కూడిన సెలవు మంజూరు

### -ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి,ఫిబ్రవరి -09(నినాదం):** ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికల ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లా లోని 3 మున్సిపాలిటీలు, పెద్దపల్లి, సుల్తానాబాద్,మంథని, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి వాణిజ్య,దుకాణం, వ్యాపార సంస్థలలో పని చేసే కార్మికులకు, ప్రభుత్వ,ప్రైవేటు రంగాలలో పనిచేసే ఉద్యోగులు సిబ్బందికి వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని దుకాణ, వాణిజ్యసంస్థల యజమానులకు, వ్యాపార సంస్థల యజమానులు ఫిబ్రవరి 11 బుధవారం రోజున మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తమ దుకాణ, వ్యాపార,వాణిజ్య సంస్థల్లో పని చేయుచున్న కార్మికులకు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా వేతనం తో కూడిన సెలవు మంజూరు చేయాలని అన్నారు. ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని,పోలింగ్ జరిగే సమయంలో షిఫ్ట్ లో ఉన్న ఉద్యోగులకు,ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు సిబ్బందికి కూడా తప్పనిసరిగా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.తెలంగాణ షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 1988 చట్ట ప్రకారము యజమానులు తప్పనిసరిగా మూసివేసి కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని, లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకొబడతాయని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### సినిమా, నిర్మాణ రంగాల్లో

## స్వల్ప కాలిక నైపుణ్య కోర్సులు

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### ఆసక్తిగల అభ్యర్థులు 20లోపు దరఖాస్తు సమర్పించాలి

### 3 నెలల పాటు ఉచిత నైపుణ్య శిక్షణ

**పెద్దపల్లి,ఫిబ్రవరి -0 9(నినాదం):** సినిమా,నిర్మాణ రంగాలలో స్వల్ప కాలిక నైపుణ్య కోర్సులు అందిస్తున్నామని ఆసక్తి గల వారు జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో 3 నెలల పాటు సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్, డబ్బింగ్ అండ్ వాయిస్ ఓవర్ స్కిల్,డిజిటల్ డిజైన్ & సోషల్ మీడియా మేనేజ్మెంట్, కన్స్ట్రక్షన్ సేఫ్టీ,మెకానికల్,కన్స్ట్రక్షన్ ఎలక్ట్రిషన్ ఎన్విరాన్మెంటల్, సర్వేయర్, సూపర్వైజర్, మెకానికల్ ఎలక్ట్రికల్,ప్లంబింగ్,ఫినిషింగ్ స్కూ ల్ ప్రోగ్రాం వివిధ కోర్సులలో నైపుణ్య శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. సినిమా కోర్సు కు 10వ తరగతి, నిర్మాణరంగ కోర్సులకు డిప్లమా, ఐటిఐ, బీటెక్ ఉత్తీర్ణత ఉండాలని, హైదరాబాద్ కొండాపూర్ లోని న్యాక్ అకాడమీలో శిక్షణ ఉంటుందని అన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, కోర్సు పట్ల ఆసక్తి గలవారు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మొదటి అంతస్తులో రూమ్ నెంబర్ 225 లో గల జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో సంబంధిత ధృవ పత్రాలతో తమ పేర్లు ఫిబ్రవరి 20 లోపు నమోదు చేసుకోవాలని,ఇతర వివరాలకు 9963313318, 9000294176 నెంబర్ల నందు సంప్రదించాలని ఆ కలెక్టర్ పేర్కొన్నారు.

## వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన విద్య పోషకాహారం అందించాలి

### -ఐటీడీఏ పిఓ యువరాజ్ మార్మాట్



**నిర్మల్ ప్రతినిధి,(కడెం) ఫిబ్రవరి 09.( నినాదం):** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మేనూ ప్రకారం పోషకాహారం అందించాల్సిందిగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అధికారులను ఆదేశించారు. మంగళవారం దస్తురాబాద్, కడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, కడెం (బాలూరు) గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, భోజన ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి భోజన నాణ్యత, సమయపాలనపై ప్రశ్నించారు. వండిన ఆహారాన్ని పరిశీలించి కంప్యూటర్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. కడెం ఆశ్రమ పాఠశాలలో 170 మంది విద్యార్థుల్లో 115 మంది మాత్రమే హాజరై ఉండగా, హాజరు నమోదు తప్పుడు విధంగా చేయడంపై వార్డెన్‌ను హెచ్చరించారు. దస్తురాబాద్ పాఠశాలలో పల్స్ యాప్ అప్‌డేట్ చేయకపోవడం, నెట్‌వర్క్ కారణాలు చూపడం, తక్కువ మోతాదులో భోజనం అందించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పల్స్ యాప్ పనితీరుపై సమీక్షించి, సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు.

### ఓట్ల లెక్కింపు సిబ్బంది తమ విధులపై

# స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి

### కలెక్టర్ అభిలాష అభినవ్





**నిర్మల్ ప్రతినిధి, ఫిబ్రవరి 09.( నినాదం):** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి తమ బాధ్యతలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనబోయే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియలో ప్రతి ఓటు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎటువంటి సందేహాలు వచ్చినా పై అధికారులను సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ఫారములను పకడ్బందీగా లెక్కింపు ప్రక్రియను అలాగే సంబంధిత పూరించి, మొత్తం ఓట్ల పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఈవో భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 60వ డివిజన్‌లో బిజెపి వైపు ప్రజల చూపు







**రామగుండం, ఫిబ్రవరి 09 (నినాదం న్యూస్):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 వ డివిజన్ రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. రోజురోజుకీ పెరుగుతున్న ప్రజల ఆదరణతో బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి శ్రావణి శ్రావణ్ యాదవ్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. డివిజన్‌లో ప్రస్తు తం పరిస్థితి చూస్తే "వార్ వన్ సైడ్" అన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. ప్రజల సమస్యలే అజెండా డివిజన్‌లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ గడపగడపకు చేరుకుంటున్న శ్రావణి శ్రావణ్ యాదవ్ ప్రజల మనసులను దోచుకుంటు న్నారు. ప్రతి ఇంటి వద్ద ఆత్మీయ స్పందన, ఆశావహమైన మాటలు బీజేపీపై నమ్మకాన్ని మరింత పెంచుతు న్నాయి. ప్రచారంలో బీజేపీ హవా,బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు ఒక్కటై నిర్వహిస్తున్న ప్రచారం డివిజన్ అంతటా రాజకీయ ఉష్ణోగ్రతను పెంచుతోంది. పార్టీ జెండాలతో, నినాదాలతో మార్మోగుతున్న వీధులు బీజేపీ బలాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి."ఈసారి మా ఓటు బీజేపీకే" ప్రజల స్వరం, డివిజన్ ప్రజలు బహిరంగంగా "ఈసారి మా ఓటు శ్రావణి శ్రావణ్ యాదవ్‌కే" అంటూ ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వమే తమ ఎంపిక అని స్థానికులు చెబుతున్నారు.

### బీఆర్ఎస్ నాయకుడు మల్లేశం ఇంట్లో

## ఎన్నికల అధికారుల తనిఖీలు



**చెన్నూరు ఫిబ్రవరి 09(నినాదం)**చెన్నూరు మున్సిపాలిటీలో బీఆర్ ఎస్ నాయకుడు మల్లేశం గౌడ్ ఇంట్లో ఎన్నికల అధికారులు, పోలీసుల తనిఖీలు సోదాలు నిర్వహించారు అనంతరం సుమన్ మాట్లాడుతూ తనిఖీలు చేస్తున్న అధికారుల తీరుపై మండిపడిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పోలీసులు మంత్రి వివేక్ కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన బాల్క సుమన్ కేవలం బీ ఆర్ ఎస్ నాయకులనే టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపణ చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ క్యాంపు కార్యాలయంలో, ఇతర కాంగ్రెస్ నాయకుల ఇళ్లలో ఎందుకు సోదాలు చేయలేదని ప్రశ్నించిన బాల్క సుమన్ అధికారులు ఎప్పుడైనా ఎన్నికల కోడ్లో మంత్రి వివేక్ కారణం తనిఖీ చేశారా అని అధికారులకు సుమన్ ప్రశ్నించారు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కార్యాలయంలో తనిఖీ చయాలని బాల్క సుమన్ అన్నారు.

### కట్టుదిట్టమైన భద్రతల నడుమ

## స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాలు

### -డీసీపీ బి. రామ్ రెడ్డి



**రామగుండం ఫిబ్రవరి 09 (నినాదం):** మున్సిపల్ ఎన్నికల నిర్వహణతో పాటు పోలింగ్ అనంతర ప్రక్రియలు సజావుగా సాగేందుకు అన్ని స్థాయిల్లో పక్కా భద్రతా చర్యలు చేపట్టామని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో ఏమాత్రం అలసత్వం చోటు చేసుకోకూడదని అధికారులను హెచ్చరించారు. రిసెప్షన్‌డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల పరిశీలన,సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను డీసీపీ పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన వసతులు, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి,ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను డీసీపీ, గోదావరిఖని ఏసీపి ఎం. రమేష్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ అధికారులు కలిసి పరిశీలించారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాలెట్ బాక్సుల భద్రతకు ఉక్కు కంచె పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచే విధానం, సీసీ కెమెరాల ఏర్పాటు, ఆర్మ్ గార్డుల నియామకం, సైన్ ఫ్లెక్సీలు, కౌంటింగ్ సమయంలో అనుమతులు, పార్కింగ్ వ్యవస్థ వంటి అంశాలపై డీసీపీ విస్తృతంగా చర్చించారు. ఎలాంటి నిర్లక్ష్యానికీ అవకాశం లేదు ఎన్నికల ప్రక్రియలో చిన్న తప్పిదం కూడా చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందిని డీసీపీ ఆదేశించారు. ఏవైనా సందేహాలు, సమస్యలు తలెత్తితే నేరుగా తనను సంప్రదించాలని స్పష్టం చేశారు. శాంతియుత ఎన్నికలే లక్ష్యం ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా శాంతియుతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని డీసీపీ బి. రామ్ రెడ్డి తెలిపారు.

## రెండేళ్లుగా లేని అభివృద్ధి ఎన్నికల ముందు గుర్తించిందా

### అబద్దాల కాంగ్రెసు నమ్మే పరిస్థితిలో తెలంగాణ ప్రజలు లేరు

### బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జీ కొరుగంటి రమణారావు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 09(నినాదం):** ప్రజలకు అబద్దాలు చెబితేనే గుడ్డిగా నమ్మి గత ఎన్నికల్లో కాంగ్రెస్కు ఓట్లేసి గెలిపించారనీ, మళ్ళీ అబద్దాలతోనే మున్సిపల్ ఎన్నికల్లో గెలుచేందు కు కుతంత్రాలు చేస్తుందనీ పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికల బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ఓ రుగంటి రమణారావు స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగింపు రోజున బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన విలేకరుల సమావేశంలో రమణారావు మాట్లాడుతూ అబద్దాల పునాదులపై గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రెండేళ్ళలో చేయలేని పనులను, మున్సిపల్ ఎన్నికలు ఉన్నాయనే నే పంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు హూ టాహుటీనా అప్పటికప్పుడే ఎలాంటి ప్రోసీడింగ్లు లేని పనులకు శంకుస్థాపనలు చేసి మొము అభివృద్ధి చేస్తున్నామని ప్రజలను మరోసారి మోసం చేస్తున్నారనీ తెలిపారు. రైతులకు యూరియా దొరకక అరిగోస పడుతున్నారనీ, రైతుబంధు ఇవ్వ డం లేదనీ అరోపించారు. ఇస్తామన్న హామీలు మ ర్చిపోయారనీ తెలిపారు. అన్న పథకాలను తీసేశా రనీ, కేసీఆర్ కిట్ ఇవ్వడం లేదన్నారు. అడబిడ్డల పెండ్లిలకు రూ. లక్షతో పాటు తులం బంగారం ఇ స్తామన్నారు. చదువుకునే విద్యార్థినిలకు నెలకు రూ.2500, వృద్ధాప్య ఫింఛన్లు 4. వేలు ఇస్తామనీ మోసపూరిత హామీలు ఇచ్చి ఇవ్వడం లేదనీ వి మర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో మళ్ళీ మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వాళ్ళు వస్తున్నారనీ వా రిని నమ్మవద్దన్నారు. ఉద్యమ పార్టీ కోసం తెలం గాణ ప్రజలు అధికారంలోకి తీసుకు వచ్చేందుకు శాయ శక్తుల పనిచేస్తున్నారనీ, సర్పంచు ఎన్నిక ల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పిన ప్రజల మరోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలని చూస్తుంటే అధికారం మదంతో కాంగ్రెస్ పార్టీ వారు బెదరిం పులకు పాల్పడుతున్నారనీ అవేదన వ్యక్తం చేశా రు. సుల్తానాబాద్ మున్సిపాలిటిలో 15 వార్డుల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల వారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. స మావేశంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పారుప ల్లి గుణపతి, నాయకులు కొడం అజయ్, జూపెల్లి సందీప్రావు, పాల రామారావు, తాళ్ళపల్లి మనోజ్ గౌడ్, కొయ్యడ అరుణ్ కుమార్, అనుమాల బాపు రావు, గట్టు శ్రీనివాస్, శేఖర్, సంతోష్, పురం ర మణ, గందె మల్లికార్జున్, శివకుమార్ తదితరు లున్నారు.

## ప్రజలంతా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

### -కలెక్టర్ అభిలాష అభియాన్




**నిర్మల్ ప్రతినిధి, ఫిబ్రవరి 09.(నినాదం):** ప్రజలంతా మున్సిపల్ ఎన్నికలలో స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి, ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఓటరు అవగాహన పెంపొందించుటకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఈ ర్యాలీని, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జెండా ఊపడం ద్వారా ప్రారంభించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత తెలిపేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ ముగిసిన అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన గొప్ప వరమని తెలిపారు. ఓటరుకు ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని వివరించారు. ఏ ఎన్నికలు వచ్చిన సంబంధిత ఓటర్లు అందరూ ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఇటీవలి గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని స్ఫూర్తిని చాటారని వివరించారు. ఇదే విధంగా మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని, పట్టణాలలో ఓటింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లందరూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందాల ద్వారా వార్డుల వారీగా ఓటు హక్కు పై విస్తృత అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలందరూ బ్యాంకింగ్ కేవైసీని ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటూ ఉండాలని తెలిపారు. కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవడం వల్ల సైబర్ మోసాలకు గురికాకుండా సురక్షితంగా ఉండగలుగుతామని పేర్కొన్నారు. బ్యాంకింగ్ అధికారులు పెద్ద ఎత్తున కేవైసీ ప్రక్రియ పై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, డీఈవో భోజన్న, ఎక్సైజ్ అధికారి ఎంఎ రజాక్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్, గ్రామీణాభివృద్ధి శాఖ, బ్యాంకింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## అకెనపల్లిలో వైభవంగా మల్లన్న పట్నం

### -నూతన వస్త్రాలు అందజేసిన సర్పంచ్ గాదె స్రవంతి సుధాకర్



**రామగుండం ఫిబ్రవరి 09 (నినాదం):** అంతర్గాం మండలం అకెనపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు మర్రి రాజ్ కుమార్ నివాసంలో నిర్వహించిన మల్లన్న పట్నం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ సర్పంచ్ గాదె స్రవంతి సుధాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ స్రవంతి సుధాకర్ మర్రి రాజ్ కుమార్ కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేసి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ పట్నం వేడుకలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గాదె స్రవంతి సుధాకర్ లు మాట్లాడుతూ..."గ్రామంలో మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడు కుంటూ, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామనీ,మల్లన్న స్వామి కృపతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని సర్పంచ్ గాదె స్రవంతి సుధాకర్ లు అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు గ్రామ ప్రముఖులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## 12 వ వార్డులో ఆఖరి రోజు ప్రచారం జోరు



**చెన్నూర్ ఫిబ్రవరి 09 (నినాదం) :** చెన్నూర్ పట్టణం లో 12 వ వార్డు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న నమ్మా అమీర్ ను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు చెన్నూర్ మునిసిపాలిటీ లో సోమవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు మంత్రి వివేక్ వెంకటస్వామి ఆశిస్సులతో ఆయనకు కాంగ్రెస్ పార్టీ లో స్థానం లభించిందని ప్రచారంలో అన్నారు 12 వ వార్డు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ నుండి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారంలో కోరారు ఈ వార్డువాసులు మహిళలు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు





### -కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డి

**సుల్తానాబాద్, ఫిబ్రవరి 09 (నినాదం):** కేంద్ర ప్రభుత్వం నిధులతోనే తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని కేంద్ర సంస్కృతిక పర్యాటక ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ ఎన్నికలలో భాగంగా రామగుండం వెళుతున్న కిషన్ రెడ్డికి సు ల్తానాబాద్‌లో బిజెపి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ప్రచారం చాలా ఉధృ తంగా కొనసాగించాం. రాష్ట్రవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీ మధ్యలోనే పోటీ కొన సాగుతుందిఅని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పైన ప్ర జల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉంది అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీ లు గాని గ్యారెంటీలు నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని కిషన్ రెడ్డి విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు అ నేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మున్సి పాలిటీల్లో పనిచేసే కార్మికులకు కనీసం వేతనాలు చెల్లించే పరిస్థితిలు కూడా లేవని తెలిపారు. వి ద్యుత్ దీపాలను మరమ్మత్తులు కూడా చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలను కొనసాగు తుందని అన్నారు. గతంలో 10 సంవత్సరాలు పాలించిన భారత రాష్ట్ర సమితి కానీ, ప్రస్తుతం రెండు సంవత్సరాలుగా పాలను కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గానీ మున్సిపాలిటీలకు చిల్లి కూడా ఇవ్వ లేదని మండిపడ్డారు. తెలంగాణ రా ష్ట్ర వ్యాప్తంగా ఏదైనా జారు అభి వృద్ధి జరిగిందంటే అది ప్రధాన మంత్రి మోడీ ఇస్తున్న సంక్షేమ పథకాలు ద్వారానే జరిగిందని కిషన్ రెడ్డి అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా పంపి ణీ చేస్తున్న ఉచిత బి య్యం, గ్రామీణ రహదారులు, జాతీయ రహదారులు, ఆస్పత్రిలో నిర్వాహ న, ఉపాధిహామీ పను లు, మంచి నీటి సరఫరా తదితర సంక్షేమ పథకాలు కేంద్ర ప్రభుత్వం ద్వారానే నిర్వహించబడుతున్నాయని అన్నా రు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతోనే రాష్ట్ర ప్రభుత్వం తన పాలనను కొన సాగిస్తుందని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్నికల ఇన్చార్జి రాణి రుద్రమదేవి, జిల్లా అధ్య క్షుడు కర్రె సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు మహేందర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు,రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్ రెడ్డి గొట్టిముక్కల సురేష్ రెడ్డి, గుర్రాల మల్లేశం , మం డల అధ్యక్షుడు కందుల శ్రీను, మిట్టపల్లి ప్రవీణ్, కందునూరి కుమార్, మహేష్ పటేల్ తో పాటు బిజెపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బి ఫామ్ ఇవ్వకుండా నా గొంతు కోశారు

**రెండుసార్లు రెబల్ అభ్యర్థిగానే గెలిచాను**

**23వ వార్డు ప్రజలు ధర్మం వైపు నిలబడతారు**

**దుర్గామాత ఆశీస్సులతో విజయం సాధిస్తా**

**స్వతంత్ర అభ్యర్థి మొలుగు దిలీప్**





**జమ్మికుంట, ఫిబ్రవరి9(నినాదం):** బీఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాల కాలంలో సామాన్య కార్యకర్తగా పార్టీకి విధేయుడుగా ఉంటూ అనేక కార్యక్రమాలు చేపట్టిన తనకు బీఫామ్ ఇవ్వకుండా గొంతు కోశారని 23వ వార్డు స్వతంత్ర అభ్యర్థి మొలుగు దిలీప్ కుమార్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పది సంవత్సరాల కాలం పాటు సేవలు అందించి ప్రతి ఇంటికి సుపరిచితుడుగా ఇంటి బిడ్డగా పేరుపొందిన దిలీప్ అనే నాకు ప్రజల నుండి సహాయ సహకారాలతో పాటు దీవెనలు ఉన్నాయని ఆ దీవెనలతోనే 23వ వార్డు జనరల్ అయినప్పటికీ బరిలో ఉంటున్నానని పేర్కొన్నారు.

### రెండుసార్లు రెబల్ అభ్యర్థిగా గెలిచాను

గతంలో రెండుసార్లు రెబల్ అభ్యర్థిగా గౌను గుర్తుపైన పోటీ చేసి గెలవడం జరిగిందని తనపై ఉన్న నమ్మకంతో ప్రజలు తనకు పట్టాం కట్టారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి కార్యక్రమంలో ప్రతి పండుగలో ప్రతి వేడుకలో తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ కుల మత వర్గ భేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించడం జరిగిందని పేర్కొన్నారు.

### ఎమ్మెల్యేకు విధేయుడుగా పనిచేశా..

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి నమ్మిన బంటుగా ఉండి చెప్పిన ప్రతి కార్యక్రమాన్ని తూచా చెప్పకుండా పాటించేవాడినని తనకు ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ బీఫామ్ ఇవ్వకుండా కొంతమంది శక్తులు అడ్డుకోవడం వల్ల అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష అధికార పార్టీకి సంబంధించిన నాయకుల ఆశీస్సులు లేకున్నప్పటికీ ప్రజల ఆకాంక్ష దీవెనలతో తాలు 23వ వార్డు నుండి పోటీ చేసి గెలుపొందుతానని చైర్మన్ పీఠంలో తానే కూర్చుంటానని ధీమా వ్యక్తం చేశారు

### దుర్గామాత ఆశీస్సులతో పాటు ప్రజల దీవెనలు నాపైనే..

దుర్గామాత దీవెనలతో తాను అనుకున్న లక్ష్యాన్ని తప్పకుండా చేరుకుంటానని 23వ వార్డు ప్రజలు తనను సేవ చేసే బిడ్డగా గుర్తించి కులాలకు అతీతంగా ఒక ప్రజాసేవకుడికి సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. 23వ వార్డు ప్రజలు సైతం తనను ప్రజాసేవ చేసేందుకు ముందుకు రావాలని ఆదరించి ఆహ్వానిస్తున్నారని వారి కోరిక మేరకు అందరి దీవెనలతో భారీ మెజార్టీతో గెలుపొందుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం విజయవాడ నుండి ప్రత్యేకంగా తెప్పించిన అమ్మవారి లడ్డు ప్రసాదాన్ని వార్డులోని ప్రతి ఇంటికి అందిస్తూ వారి ఆశీర్వాదం తీసుకున్నట్లు దిలీప్ తెలిపారు.





# 24వ వార్డు ప్రజల చూపు ప్రణీత వైపే

**గౌను గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని ప్రచారం**

**ధైర్యంగా ఉండు అండగా ఉంటాం..**

**స్వతంత్ర అభ్యర్థిని దీవిస్తున్న ప్రజలు**

**జమ్మికుంట, ఫిబ్రవరి 9 (నినాదం) :** మున్సిపల్ పరిధిలోని 24 వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి మొలుగు ప్రణీత తనకు కేటాయించిన గౌను గుర్తుపై ఓటు వేసి గెలి పించాలని గడప గడపకు తిరుగుతూ ప్రచారం నిర్వ హించారు. సోమవారం ఇంటింటా ప్రచారంలో భాగంగా 24వ వార్డులో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న ప్రణీ తకు వార్డు ప్రజల నుండి విశేష స్పం దన రావడంతో ఆమె తన ప్రచారాన్ని మరింత ఉత్సాహంతో నిర్వహించారు.

### దిలీప్ అన్న ఆశీస్సులతో అభివృద్ధి చేస్తా

గతంలో 12వ వార్డు నుండి రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కౌన్సిలర్ గా గెలిచిన మేము రాబోయే రోజుల్లో 12వ వార్డును ఏ విధంగా అయితే అభివృద్ధి చేసామో అదేవిధంగా రాబోయే రోజుల్లో 24 వ వార్డును అభివృద్ధి చేస్తామని ఆమె వార్డు ప్రజలకు తెలిపారు. అన్నయ్య దిలీప్ సహకారంతో వార్డు ప్రజల దీవెనలతో అభివృద్ధి చేస్తానని ఒక అవకాశం ఇచ్చి గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు.

### కష్టాలలో కన్నీళ్ళలో అండగా ఉంటాం

కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డు సమస్యలే కాకుండా వార్డులోని ఏ కుటుంబానికి కష్టం వచ్చినా కన్నీళ్లు వచ్చినా వారికి అండగా నిలబడి వారి సమస్యను పరిష్కరిస్తామని వారి కష్టాలలో పాలు పంచుకుంటామని అన్నకు చెల్లిగా మీ ఇంటి ఆడబిడ్డగా మీకు అందుబాటులో ఉండే సేవ చేస్తానని ప్రణీత తెలిపారు. పార్టీలపతీతంగా మీ అమూల్యమైన ఓటు గౌను గుర్తుపై వేసి గెలిపించాలని ఆమె కోరారు.

# రందెందుకే రాజన్నా...
# మాకు ఎవరెక్కువే నీకన్న

**ప్రచారంలో రాజిరెడ్డి దంపతుల కన్నీటిపర్యాంతం**

**ఓదార్చి భరోసానిచ్చిన మాతంగికాలని జనం**

**భారీ బహిరంగసభ, బైక్ ర్యాలీ**

**తమ మద్దతూ చేతి గుర్తుకేనన్న సీపీఎం**



**రామగుండం, ఫిబ్రవరి9 (నినాదం):** చివరిరోజు ప్రచారంలో భాగంగా రామగుండం కార్పోరేషన్ 23 వ డివిజను కార్పోరేటర్ అభ్యర్థి బెంద్రం రాజిరెడ్డి ప్రచారం విజయవంతమైంది.

### ఖాజీపల్లి బహిరంగ సభకు భారీ స్పందన..

తొలుత డివిజనులోని ఖాజీపల్లిలో పెద్ద ఎత్తున బహిరంగసభ నిర్వహించారు. దీనికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై కాంగ్రెస్ అభ్యర్థికి తమ మద్దతు తెలిపారు. సభ అనంతరం రాజకీయ వాతావరణం మరింత ఉత్కంఠభరితంగా మారగా, మాతంగి కాలనీలో కాంగ్రెస్ పార్టీకి భారీ బలం చేకూరింది.

### ప్రజాసమస్యలు పరిష్కరించే నేత రాజిరెడ్డి..

ఎమ్మెల్యే బలమైన మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న బెంద్రం రాజిరెడ్డికి సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య సైతం సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మాతంగికాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను నిజాయితీగా ప్రతినిత్యం పరిష్కరించే నేతలు బెంద్రం సునీత రాజిరెడ్డే అని స్పష్టం చేశారు. చేతి గుర్తుకు ఓటు వేసి ఆయనను గెలిపించాలని యాకయ్య ప్రజలకు పిలుపునిచ్చారు.

### భారీ బైక్ ర్యాలీ..

ఆపై మాతంగికాలనీ మీదుగా ప్రగతినగర్, గౌతంనగర్ సెంటర్, శాంతినగర్ వరకు వెయ్యిమందితో బెంద్రం దంపతులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు.







## 17వ వార్డు ప్రజల చూపు
# కనుమల్ల వైపే

**అభివృద్ధి సంక్షేమమే ఎజెండాగా గణపతి ప్రచారం**

**ఇంటింటా ప్రచారంలో దూసుకెళ్తున్న బిజెపి అభ్యర్థి**



**జమ్మికుంట, ఫిబ్రవరి 9 (నినాదం) :** జమ్మికుంట మున్సి పల్ పరిధిలోని 17 వ వార్డు బిజెపి బలపరిచిన అభ్యర్థి కనుమ గణపతి తన ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగి స్తున్నారు. మున్సిపాలిటీలోని అత్యంత దీనస్థితిలో ఉన్న 17 అవార్డు ను అభివృద్ధి చేయడమే తన ప్రధాన ఏజెండా అని గణపతి తెలిపారు. సోమవారం ఇంటింట ప్రచారం నిర్వహించిన అనంతరం ఆయన నినాదంతో మాట్లాడు తూ, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల 17వ వార్డు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని గణపతి అన్నారు. తనకు ఒక అవకాశం ఇచ్చి గెలిపిస్తే వార్డు రూపురేఖలు మారుస్తానని ఆయన ప్రజలకు హామీ ఇస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

### కేంద్రం నిధులతో వార్డులో అభివృద్ధి పనులు

17వ వార్డు అభ్యర్థిగా తనను గెలిపిస్తే కేంద్ర నిధులతో మంత్రి బండి సంజయ్ సహకారంతో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ముఖ్యంగా డ్రైనేజీలు సిసి రోడ్ల నిర్మాణం బోర్వెల్ ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేస్తానని ఆయన తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించిన తన సతీమణి ఈ వార్డు ప్రజల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపాలని తనకు తెలిపారని ప్రజల ఆకాంక్షను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికతో వార్డు అభివృద్ధి చేస్తానని తెలిపారు..

### బొడ్రాయి పోచమ్మ గుడి నిర్మాణం చేపడతా

గ్రామదేవతల ఆశీస్సులతోనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని 17 వ వార్డు ప్రజల కోరిక మేరకు బొడ్రాయి నిర్మాణంతో పాటు పోచమ్మ గుడి ఆలయ నిర్మాణాన్ని వార్డు ప్రజల సహకారంతో ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం నా బాధ్యత అని అన్నారు. ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే నాయకుడిగా కాకుండా సేవకుడిగా సేవలు అందిస్తానని తెలిపారు. 17వ వార్డు ప్రజలు చైతన్యవంతులని వారు ఎవరిని ఎన్ను కావాలో ఇప్పటికే ఒక ప్రణాళికతో ఉన్నారని వారి ఆశీర్వాదంతో నేను గెలుస్తున్నానని గణపతి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ముందంజలో శ్రీమతి..
# మెజారిటీ జనం ఇమ్మతి

**గెలుపు దిశగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జంబోజు శ్రీమతి-సమ్మయ్య**

**7 వ వార్డులో ప్రచారం జోరు... చేతి గుర్తు హుషారు**







**మంథని టౌన్ ఫిబ్రవరి9 (నినాదం) :** మంథని మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి జంబోజు శ్రీమతి సమ్మయ్య కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుంది. ప్రచారంలో గడపగడప తిరుగుతూ ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే నాయకురాలుగా కాకుండా సేవకురాలిగా సేవలందిస్తానని చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. 7వ వార్డు అభివృద్ధి సాధించాలంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని వారన్నారు . రాష్ట్రంలో అధికారంలో ఉంది కాంగ్రెస్ ప్రభుత్వమని 7వ వార్డు అభివృద్ధి విషయంలో ఒక ప్రత్యేక ప్రణాళికతో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సహాయక సహకారాలతో ముందుకు వెళ్తున్నామని ఓటర్లకు హామీ ఇచ్చారు. మొదటిసారిగా ఎన్నికల బరిలో దిగుతున్న తనకు కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం కల్పించి టికెట్ ఇచ్చిందని ఏడవ వార్డు ప్రజలు ఒక అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే కౌన్సిలర్ గా గెలిచి మీ బిడ్డగా సేవలు అందిస్తానని అవినీతి లేకుండా అండగా నిలబడ తానని ఆశీర్వదించి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. 7వ వార్డు ప్రజల నుండి అనుకూల స్పందన రావడంతో ప్రచారాన్ని హుషారుగా కొనసాగించారు.







## వంశీ నైజం ప్రజాహితం..
# 13వ వార్డు 'హస్త'గతం

**గెలుపు దిశగా కాంగ్రెస్ అభ్యర్థి ఎల్లంకి**

**మంథని టౌన్ ఫిబ్రవరి9 (నినాదం):** మంథని మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎల్లంకి వంశీ కి రోజురోజుకి ప్రజల ఆదరణ పెరగడంతో గెలుపే లక్ష్యంగా ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నారు. వార్డు లోని గడపగడప తిరుగుతూ ఓటర్లను చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. అభివృద్ధి పారదర్శకత పాలన ప్రజల సంక్షేమ లక్ష్యంగా చేస్తున్న ప్రచారానికి ప్రజల నుండి అనూహ్యస్పందన లభిస్తుంది. కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ ఎల్లంకి వంశీ గెలిపించండి అనే నినాదాలు మార్మోగుతున్నాయి. యువకులు మహిళలు పెద్ద ఎత్తున వంశీకి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. 13వ వార్డు అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నమ్మిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎల్లంకి వంశీకి రోజురోజుగా ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహాయ సహకారాలతో 13 వ వార్డు కు మరింత అభివృద్ధి చేస్తానని ఆయన తెలిపారు. ప్రచారంలో చివరి రోజు అయిన సోమవారం వార్డులోని ప్రజలు వంశీకి ఘన స్వాగతం పలుకుతూ తమ మద్దతు తెలిపారు.

NINADAM CINEMA

## తెలుగు రాకున్నా
# మేనేజ్ చేస్తున్నా

**వారిణాసి హీరోయిన్ ప్రియాంక**



రాజమౌళి-మహేష్ బాబుల క్రేజీ కాంబోలో వస్తున్న 'వారణాసి' సినిమా ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది. సుమారు రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్తో తెరకెక్కుతున్న ఈ గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్లో ప్రియాంక చోప్రా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. మహేష్ బాబు 'రుద్ర'గా కనిపిస్తుండగా, విలన్ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. అయితే ఈ మూవీ గురించి ఎలాంటి చిన్న వార్త వచ్చిన కూడా నిమిషంలో వైరల్ అవుతుంది. ఇందులో భాగంగా తాజాగా అంతర్జాతీయ మీడియాతో మాట్లాడిన ప్రియాంక, ఈ సినిమాలో నటించడం తన కెరీర్లోనే ఒక విభిన్నమైన అనుభవమని పేర్కొన్నారు. ముఖ్యంగా.. తెలుగు భాష రాకపోవడం తనను ఇబ్బంది పెట్టినప్పటికీ, రాజమౌళి సహకారం తో దాన్ని అధిగమిస్తున్నట్లు తెలిపారు. ప్రియాంక చోప్రా మాట్లాడుతూ.. 'వారణాసి సినిమాలో నటించడం నాకు ఒక పెద్ద ఛాలెంజ్గా మారింది. నిజం చెప్పాలి అంటే నాకు తెలుగు అస్సలు రాదు, అర్థం కూడా కాదు. కేవలం డైలాగులను అక్షరాలా గుర్తుపెట్టుకుని పలుకుతు న్నాను. సెట్లో ఒక్కసారిగా డైలాగ్స్ మారిస్తే నాకు చాలా కష్టమవుతుంది. అలాంటి సమయంలో రాజమౌళి సర్ నాకు అండగా నిలుస్తారు. ప్రతి మాట అర్థం, భావం వివరించి అది ఏ టోన్లో చెప్పాలో ఆయన వివరంగా చెబుతారు. కొన్నిసార్లు డైలాగ్ అర్థం చేసుకోవడానికి పది నిమిషాలు సమయం తీసుకుని, నా స్టైల్లో చెప్పే ప్రయత్నం చేస్తాను. ఇది నాకు ఒక అదనపు పెర్ఫార్మెన్స్ లేయర్ లాంటిది' అని వివరించారు. తన తోటి నటుడు పృథ్వీరాజ్కు కూడా తెలుగు రాదని, కానీ తనకంటే ఆయనే కొంచెం బెటర్ అని ప్రియాంక సరదాగా వ్యాఖ్యానించారు.

ÓáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787